RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 359 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 జనవరి 2025 ఆదివారం పేజీలు : 4

## కోయకుండానే కన్నీళ్లు వస్తున్నాయి..

### ఉల్లి ధరలకు రెక్కలు.. కిలో ఎంతంటే..

బెంగళూరు : ఉల్లి ధరలు పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా పండించే చిన్న రకం ఉల్లి ధర అమాంతం పెరిగింది. నిన్న, మొన్నటి దాకా రూ. 70 ఉన్న కేజీ ధర శుక్రవారం కిలో రూ. 100 పలికింది. కృష్ణగిరి జిల్లాతోపాటు పొరుగున సరిహద్దు ప్రాంతాల్లో ఉల్లి సాగు తగ్గడం కూడా కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. హొసూరు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా చిన్న ఉల్లిపాయ సాగు చేస్తుంటారు. అదేవిధంగా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాల్లో కూడా సాగు చేస్తుంటారు.

ఇక్కడి పంటలు స్థానికంతోపాటు విదేశీ మార్కెట్‌లకు కూడా ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో దిగుబడి తగ్గడంతో సరిహద్దుల్లో పండించిన చిన్న ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగింది.

# 'స్థానికం'లో సత్తా చాటే దిశగా...

# అధికార పార్టీ అడుగులు

హైదరాబాద్ : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తున్న కాంగ్రెస్.. అందుకు తగ్గట్టుగా పావులు కదుపుతోంది. వరుసగా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రానుండడంతో జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా డీసీసీ అధ్యక్షుల నియామకంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కసరత్తు ప్రారంభించారు. ఈ నెలాఖరులోపు డీసీసీలను ప్రకటించే అవకాశమున్నందున ఇప్పటికే ఆయా జిల్లాల మంత్రులు, ఇన్?చార్జ్? మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు సీనియర్ నేతల అభిప్రాయాలను తీసుకున్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో క్యాడర్‌ను నడిపించాలంటే బలమైన నేతలు డీసీసీ అధ్యక్షులుగా ఉండాలని పీసీసీ చీఫ్‌కు హైకమాండ్ కూడా సూచించింది. ఎమ్మెల్యేలే పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉంటే పార్టీకి మంచి ఊపు వస్తుందన్నది ఢిల్లీ పెద్దల ఆలోచనగా కనిపిస్తోంది.

ఈమేరకు జిల్లాల్లో ఎమ్మెల్యేలకే పార్టీ పగ్గాలు ఇవ్వాలనే నిర్ణయానికి పీసీసీ వచ్చింది. ఎమ్మెల్యేలు లేని చోట ఎమ్మెల్సీలకో, మాజీ ఎమ్మెల్యేలకో పగ్గాలు కట్టబెట్టాలని భావిస్తోంది.

**కొన్ని జిల్లాల్లో సమస్యలు..** కొన్ని జిల్లాల్లో పార్టీ పగ్గాలు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ముందుకు రావడంలేదని చర్చ జరుగుతోంది. ఇంకొన్ని జిల్లాల్లో ఇతర సమస్యలు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. సిరిసిల్ల నియోజకవర్గం బీఆర్ఎస్ చేతిలో ఉండగా, వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్ గా ఉన్నారు. దీంతో ఆ జిల్లాలో పార్టీ అధ్యక్ష పదవి మాజీ ఎమ్మెల్యేకో, లేదంటే పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేతకో ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, జనగామ జిల్లాలో జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఒక్కటే ఉంది. జనగామను ఆనుకొని ఉన్న ఇతర నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాలు మాత్రమే ఈ జిల్లా పరిధిలోకి వస్తాయి. కానీ, జనగామ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే లేరు. దీంతో ఆ జిల్లాలోనూ డీసీసీ చీఫ్ పదవి ఆ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేకో, పార్టీ సీనియర్ నేతకో ఇవ్వాలని భావిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు మంత్రి పదవి.. లేదంటే



## ఎమ్మెల్యేలకే డీసీసీ చీఫ్ పదవులు

## ఎమ్మెల్యేలు లేని జిల్లాల్లో మాజీలకు బాధ్యతలు

# హైకమాండ్ ఆదేశాలతో పీసీసీ కసరత్తు

రాష్ట్రస్థాయిలో కీలక కార్పొరేషన్ పదవులపై కన్నేశారు. ఇలాంటివాళ్లు డీసీసీ చీఫ్ బాధ్యతలు తమకు వద్దని ఇటు సీఎం రేవంత్ కు, అటు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కు, పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీకి రిక్వెస్టులు పెట్టుకుంటున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి అనుకున్న ఫలితాలు రాకుంటే డీసీసీ చీఫ్ గా తమను బాధ్యులను చేస్తారని, భవిష్యత్?లో తమకు ఇతర ఏ పదవులు దక్కే అవకాశం ఉండదని పలువురు ఎమ్మెల్యేలు ఈ బాధ్యతలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. అయితే, ఇష్టం ఉన్నా లేకపోయినా పార్టీ నిర్ణయం శిరసావహించాల్సిందేనని పీసీసీ నాయకత్వం తేల్చి చెప్తుండడంతో కొందరు ఎమ్మెల్యేలు కలవరపడుతున్నారు. మెజార్టీ జిల్లాల్లో మాత్రం పార్టీ ఎమ్మెల్యేలకే డీసీసీ చీఫ్ పదవులు ఇచ్చేనిర్ణయం జరిగిపోయిందని, ఈ నెలాఖరులోగా ప్రకటన వెలువడడమే తరువాయి అని ప్రచారం సాగుతోంది.

# ఆసక్తిరేపుతోన్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. అభ్యర్థి ఎంపికపై కన్ఫ్యూజన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్..!

వరంగల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్తర తెలంగాణ పాలిటిక్స్‌ను హీటెక్కిస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించి ఊపు క్రియేట్ చేసింది. అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ కన్ఫ్యూజన్‌లో ఉంది. టీచర్ ఎమ్మెల్సీపై బీఆర్ఎస్ ఉలుకు పలుకు లేదు. కానీ కేయూ కేంద్రంగా సామాజిక సంస్థలు, విద్యారంగంలోని అసోషియేషన్లు అనూహ్యమైన అడుగులు వేశాయి. సబ్బండ వర్గాల మద్దతుతో ఓ ఉద్యమకారుడు సమరానికి సైఅంటున్నారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల్లో ఆ కటౌట్ హాట్ టాపిక్ అవుతుంది. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంతో పాటు, కరీంనగర్–ఆదిదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్ మరియు గ్రాడ్యుయేట్ MLC ఎన్నికలకు రేపోమాపో నగారా మోగనుంది. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల MLC స్థానం 191 మండలాల పరిధిలో విస్తరించి ఉంది. 24వేల 905 మంది టీచర్లు ఓటర్లుగా ఉన్నారు. బీజేపీ అభ్యర్థిగా ప్రకటించగా..అధికార కాంగ్రెస్ మాత్రం ఎవరికి మద్దతు తెలపాలి..పోటీ చేయాలా.? వద్దా అనే డైలమాలో ఉందట. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి చర్చ లేకుండా పూర్తిగా సైలెంట్‌గా ఉంది. వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికపై బీఆర్ఎస్ వ్యూహమేంటో అంతు చిక్కడం లేదు. కాంగ్రెస్ వేచి చూసే ధోరణితో వ్యహరిస్తోంది. అయితే వారం రోజుల నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని ఉపాధ్యాయ సంఘాల యాక్టివిటీలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలు వ్యూహాత్మకంగా ఉన్నప్పటికీ..కాకతీయ యూనివర్సిటీ కేంద్రంగా ఉండే సామాజిక సంస్థలు, కుల సంఘాలు, విద్యారంగంలోని వివిధ అసోషియేషన్లు కీలక నిర్ణయం వైపు అడుగులు వేస్తున్నాయి. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్న వ్యక్తిగా, ప్రతిష్టాత్మక కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్‌గా విద్యారంగంలో మంచి సంబంధాలున్న సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్‌పై ఉపాధ్యాయ సంఘాలు ఫోకస్ చేశాయి. గతంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పనిచేశారు రాజ్ యాదవ్. బీసీ సామాజిక ఉద్యమాల్లో రాష్టస్థాయి నేతగా ముద్రపడిన సుందర్ రాజ్ యాదవ్ అయితే..టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సరైన క్యాండిడేట్ అని భావిస్తున్నారు. ఆయన కూడా పోటీ చేయాలని డిసైడ్ అయినట్లు ప్రకటించారు. విద్యావేత్తగా, సామాజిక ఉద్యమ నేతగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ఉన్న సుందర్ రాజ్ యాదవ్ రేసులోకి రావడంతో వరంగల్ కేంద్రంగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు హీటెక్కుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడిగా, తన విద్యాసంస్థలనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అడ్డగా మార్చిన నాయకుడిగా సంగంరెడ్డి




సుందర్ రాజ్ యాదవ్‌కు గుర్తింపు ఉంది. కుడా చైర్మన్‌గా పనిచేయడంతో వివిధ రాజకీయ పార్టీలతో సత్సంబంధాలున్నాయి. ఇలాంటి నేపథ్యంలోనే గతంలో సుందర్ రాజ్ యాదవ్‌కు రాజ్యసభ సీటు దక్కినట్లే దక్కి చేజారింది. రెండుసార్లు ఇదే వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం రావడం చివరి నిమిషంలో గులాబీబాస్ కేసీఆర్ సర్ధిచెప్పడంతో వెనక్కి తగ్గారు. అప్పటి నుంచే బలమైన గొల్ల కురుమ సామాజిక వర్గం నుంచి సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్ పేరు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు తనకు ఏ రాజకీయ పార్టీని మద్దతు అడగ లేదని, ప్రస్తుతానికి సబ్బండ వర్గాల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగానే టీచర్ ఎమ్మెల్సీగా బరిలోకి దిగుతున్నానంటున్నారు సుందర్ రాజ్ యాదవ్. అయితే ఇప్పుడు అధికార కాంగ్రెస్ వ్యూహం ఎలా ఉండబోతుంది.? బీఆర్ఎస్ అభ్యర్థిని బరిలోకి దింపుతుందా.? లేక ఎవరికైనా మద్దతు ఇస్తుందా అనేది ఆసక్తిని రేపుతోంది. నోటిపికేషన్ వస్తే పార్టీల స్టాండ్ ఏంటో స్పష్టం కానుంది.

# రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందొద్దు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల



జాబితాలో పేర్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులగణన, సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ఆధారంగా, పాత రేషన్ కార్డుల సమాచారం ప్రకారం అర్హుల పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు. అర్హులని భావించినవారు.. ఎవరికైనా కార్డులు రాకపోతే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు.




# జనవరి 26 జాతరే... జాతర...!

## తెలంగాణ ప్రజలకు పండుగలాంటి వార్త

## ఆ రోజున రెండో విడత సంక్షేమ పథకాల జాతర....

హైదరాబాద్ : ఈనెల 26 నుంచి తెలంగాణలో రెండో విడత సంక్షేమ పథకాల జాతర షురూ కాబోతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.. మొత్తం నాలుగు పథకాలు అమల్లోకి రాబోతున్నాయ్. ఇందుకోసం లబ్దిదారుల ఎంపికను యుద్ధప్రాతిపదికన మొదలుపెట్టింది ప్రభుత్వం. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి... గ్రామ సభల్లో చర్చించి.. ఆ తర్వాతే అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నది ప్రణాళిక. అమలు కార్యాచరణ కోసం జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి. ఎటువంటి అపోహలకు తావు లేకుండా లబ్దిదారుల ఎంపిక జరగాలని, నిజమైన అర్హులకే లబ్ది దక్కేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతు భరోసా అమలు దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది రేవంత్ ప్రభుత్వం. గత ప్రభుత్వంలో అసలైన రైతుల కంటే నకిలీ రైతుల జేబుల్లోకే ఎక్కువగా రైతుబంధు నిధులు వెళ్లాయని భావించిన సర్కార్.. తమ హయాంలో ఇటువంటి లూప్‌హోల్స్ లేకుండా అమలు చేయాలని డిసైడైంది.

ముఖ్యంగా రైతుభరోసా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది రేవంత్ ప్రభుత్వం. సాగులో ఉన్న భూమి కోసం ఏటా 12వేలు పెట్టుబడి సాయంగా అందజేయాలన్నది ప్రభుత్వ సంకల్పం నుంది. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడున్నర వెయ్యి చొప్పున రెండు పంటలకూ కలిపి 15 వేలు జమ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి దీన్ని 12వేలకు కుదించింది రేవంత్ సర్కార్. భూభారతి పోర్టల్ నుంచి పట్టదారు పాస్ పుస్తకాలున్న రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారులకుఅందజేసింది ప్రభుత్వం. ఈ డేటా ఆధారంగా రెవెన్యూ అధికారితో కూడిన ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములు ఎక్కడ..? గ్రామాల్లో ఇళ్లు, కాలనీలుగా మారిన భూములేంటి? రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాములకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు.. ఇలా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతీ సర్వేనెంబర్‌ను పరిశీలించి... వ్యవసాయయోగ్యం కాని ప్రతీ సెంటునూ లెక్క తేల్చడమే టార్గెట్.

రాళ్లు–రప్పలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, నివాస స్థలాలకు రైతు భరోసా ఇచ్చి ప్రజాధనాన్ని వృధా చేయకుండా ఈ సర్వే దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అధికారుల సర్వేకు రైతులనుంచి కూడా మద్దతు లభిస్తోంది. గ్రామాల్లో ఒక్కో సర్వే నెంబర్‌ను డిజిటల్ మ్యాప్స్, జిపిఎస్ ద్వారా పరిశీలిస్తారు. ఐదు రోజుల పాటు సర్వే చేసిన తర్వాత.. సేకరించిన వివరాలను గ్రామ సభలో చదివి వినిపిస్తారు. 24వ తేదీ వరకు అభ్యంతరాల్ని స్వీకరించి.. చర్చిస్తారు. 25వ తేదీ నాటికి తుదిజాబితాను జిల్లా కలెక్టర్లు నిర్ధారించి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తారు. ఇన్‌చార్జ్ మంత్రులతో ఆమోదం తీసుకుంటారు. 26 నుంచి అర్హులైన రైతులకు రైతు భరోసా అమలు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల 99 వేల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలున్నాయి. ధరణి రికార్డుల ప్రకారం మొత్తం భూమి 1.52 కోట్ల ఎకరాలు. ఇందులో సాగు చేయని భూములు తీసేస్తే కోటి 30 లక్షల ఎకరాలు మాత్రమే మిగులుతాయని, వీటికి మాత్రమే రైతు భరోసా అందుతుందని ప్రాథమిక అంచనా వేసింది ప్రభుత్వం. ఇందుకోసం 7 వేల 625 కోట్లు అవసరమౌతుంది.

తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది.. అందరూ ఈ నాలుగురోజుల పాటు ఉరుకులు పరుగుల మీద సర్వే చేస్తారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారుల ఎంపిక చేసి డేటా సిద్ధం చేస్తారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ కు మరో ఘోర పరాభవం వెయిట్ చేస్తోందా?

కాలం మహా చిత్రమైంది. ఎవరు కింగ్.. మరెవరు బొంగు అన్నది తేల్చేది కాలమే. ఎవరెంత ప్రభావం చూపుతారన్న దానికి కాలానికి మించిన పవర్ ఫుల్ మరొకటి ఉండదనే చెప్పాలి. ఢిల్లీ రాష్ట్రంలో అధికారాన్ని సొంతం చేసుకోవటం కోసం అగ్రపార్టీలు ఇప్పుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి వేళ.. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూసినప్పుడు అయ్యో అనుకోకుండా ఉండలేం. ఎందుకంటే..ఒకప్పుడు ఆ పార్టీకి ఢిల్లీ కంచుకోట. షీలా దీక్షిత్ నాయకత్వంలో ఢిల్లీలో తిరుగులేని అధిక్యతను కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించేది. అంతేనా.. హ్యాట్రిక్ విజయంతో ముచ్చటగా మూడు సార్లు అధికారాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఉనికి కోసం పోరు చేయాల్సిన దుస్థితి. గడిచిన రెండు దఫాలుగా ఢిల్లీ రాష్ట్రాన్ని సొంతం చేసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ.. మూడోసారి విజయం సాధించటం ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆప్ జోరుకు బ్రేకులు వేసి.. అధికారాన్ని సొంతం చేసుకోవాలని కమలనాథులు తపిస్తున్నారు. ఇలాంటి వేళలో కాంగ్రెస్ పార్టీ మాత్రం ఉనికి కోసం పోరాడుతుంది. అధికారం మీద ఎలాంటి ఆశలు పెట్టుకోని ఆ పార్టీ.. గౌరవప్రదమైన సీట్లు దక్కితే చాలు అన్నట్లుగా ఉంది. అయితే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి సింగిల్ డిజిట్ సీట్లు రావటం అసాధ్యమంటున్నారు. పేరుకు ముక్కోణ పోటీ అన్నట్లు ఉన్నా.. అసలు పోరు మాత్రం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ.. బీజేపీకి మధ్యనే ఉంటుందని చెబుతున్నారు. కేసుల నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్.. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే మాత్రం తాను ముఖ్యమంత్రి పదవిని చేపడతానని చెప్పటం తెలిసిందే. ఇదిలా ఉండగా ఎన్నికల వేడి పార్టీల మాటల్లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతుండగా.. ఫలితాలు 8 తేదీన విడుదల కానున్నాయి. ఎన్నికల ప్రచారం అంతకంతకూ పెరుగుతోంది. దీంతో..పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం అంతకంతకూ ముదురుతోంది. ఢిల్లీలో కాంగ్రెస్ కు దిక్కులేదని.. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీ రాష్ట్ర పీఠాన్ని బీజేపీ చేతికి వెళ్లకుండా ఉండేందుకు ఆమ్ ఆద్మీ సర్వ శక్తుల్ని ఒడ్డుతోంది. ఇలాంటివేళ.. కాంగ్రెస్ కు మరో ఘోర పరాభవం ఖాయమంటున్నారు. అంతిమ తీర్పు ఇవ్వాల్సిన ఓటర్లు ఏం చెబుతారన్నది తేలాలంటే మరికొద్ది రోజులు వెయిట్ చేయక తప్పదు.

## ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే మల్లారెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామానికి చెందిన అబ్బగౌని శంకరమ్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రూ. 52500 ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆమె కుమారుడు బిక్షపతి గౌడ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ వెంకట్ రెడ్డి, అబ్బగౌని శ్రీకాంత్ గౌడ్, అబ్బగౌని వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు.

## ఈనెల 21 నుండి లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు : ఎంపీడీవో



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ పథకాల అమలుపై ఈనెల 21 నుండి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మమతాబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలపై ఈ నెల 21 నుంచి 24 వరకు శామీర్ పేట మండలము లోని 7 గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు, అలాగే బాబాగూడ, బోమ్మరాసిపేట, శామీర్ పేట లలో వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 న ఉదయం 8 గంటలకు అలియాబాద్ గ్రామపంచాయతీ వద్ద, 10 గంటలకు బొమ్మ రాసిపేట వార్డు కార్యాలయం, మధ్యాహ్నం 2 గంటలకు బాబా గూడ వార్డు కార్యాలయం వద్ద లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22 న ఉదయం 10 గంటలకు పొన్నాలు, ఉదయం 10 గంటలకు లాల్ గడి మలక్ పేట గ్రామపంచాయతీల వద్ద గ్రామసభ జరుగుతుందన్నారు. 23 న ఉదయం 9 గంటలకు యాడారం, 10 గంటలకు తుర్కపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు మురహారిపల్లి లలో గ్రామ సభలు జరగనున్నట్లు తెలిపారు. 24 న ఉదయం 10 గంటలకు శామీర్ పేట వార్డు కార్యాలయం, ఉదయం 10 గంటలకు మజీద్ పూర్ గ్రామపంచాయతీ ల వద్ద గ్రామసభలు జరపనున్నట్లు చెప్పారు.

## మాటలు బురిడీ.. కొలువుల గారడీ!



హైదరాబాద్: కరీంనగర్‌కు చెందిన యువకుడు ఎంబీఏ పూర్తిచేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. దుబాయ్‌లో ఉద్యోగ అవకాశాలు.. నెలకు రూ.రెండున్నర లక్షల జీతం అంటూ అమీర్‌పేట్‌లోని కన్సల్టెన్సీ ఇచ్చిన ప్రకటనకు ఆకర్షితుడై రూ.4.5 లక్షలు చెల్లించాడు. ఏడాది దాటినా కొలువు లభించకపోగా పొలం తాకట్టుపెట్టి తెచ్చిన రుణానికి వడ్డీలు కట్టలేక ఆందోళనకు గురయ్యాడు. పోలీసుల వద్దకు వెళ్తే అసలు సొమ్ము రాదనే ఉద్దేశంతో ఒక ప్రజాప్రతినిధిని ఆశ్రయించాడు. ఎల్బీనగర్‌కు చెందిన యువతికి సింగపూర్‌లో నర్సు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మరో కన్సల్టెన్సీ రూ.2 లక్షలు కొట్టేసి ముఖం చాటేసింది. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన ఎంతో మంది యువతీయువకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాల బాటలో మోసగాళ్ల మాటలకు తలొగ్గుతున్నారు. తమతో పాటు చదివిన వారంతా ఉద్యోగాల్లో స్థిరపడడం, కుటుంబసభ్యులు, బంధువుల నుంచి ఖాళీగానే ఉన్నారా.. అంటూ ఎదురయ్యే ప్రశ్నలకు జవాబు చెప్పలేక మాయగాళ్ల వలకు చిక్కుతున్నారు. నకిలీ కన్సల్టెన్సీల చేతిలో సమయం, డబ్బు నష్టపోతున్నారు.

**మోసాలు ఏటా రెట్టింపు**

గతేడాది నగరంలో ఎంప్లాయిమెంట్ స్కామ్స్/జాబ్‌రాకెట్‌పై 26 కేసులు నమోదయ్యాయి. 204 మంది బాధితులు సుమారు రూ.21 కోట్లు నష్టపోయారు. మోసాలకు పాల్పడిన 58 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది బాధితుల సంఖ్య రెట్టింపు కావచ్చని పోలీసుల అంచనా. గ్రేటర్ పరిధిలో 30కి పైగా నకిలీ కన్సల్టెన్సీలు నడుస్తున్నట్లు నగరానికి చెందిన పోలీసు అధికారి తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో వీటిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు వివరించారు.

**ఊరించి.. సొమ్ములు కొట్టేసి**

గ్రేటర్ పరిధిలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు, వీసా సౌకర్యం కల్పిస్తామంటూ వందలాది ప్రైవేటు కన్సల్టెన్సీ సంస్థలు వెలిశాయి. వీటిలో కొన్ని నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుండగా అధిక శాతం కన్సల్టెన్సీలు పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ మోసగిస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. తాజాగా హిమాయత్‌నగర్‌కు చెందిన జేజేరెడ్డి కన్సల్టెన్సీ 100 మందిని మోసగించినట్లు బయట పడింది. విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాలున్న ప్రాంతాల్లో ప్రారంభిస్తున్న కన్సల్టెన్సీలు సామాజిక మాధ్యమాలు, ఏజెంట్ల ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న వారిని ఆకట్టుకుంటున్నాయి. మరికొన్ని సంస్థల నిర్వాహకులు ఉద్యోగాల అన్వేషణలో ఉన్న యువతీ, యువకుల వివరాలు సేకరించి వారి ఈ మెయిల్, ఫోన్ నంబర్లకు దేశ, విదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో విద్యార్హతకు తగినట్లుగా ఉద్యోగం కల్పిస్తామంటూ సమాచారం పంపుతున్నారు. 3 నెలల వ్యవధిలోనే ఖర్చు చేసిన సొమ్ము తిరిగి సంపాదించుకోవచ్చని తీయటి కబుర్లతో యువతను బురిడీ కొట్టిస్తున్నారు.

## దక్షిణ ఇస్తే సరే..!



హైదరాబాద్ : ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కొందరు రైతులు.. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులతో మరిన్ని కష్టాలు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు రికార్డులను కంప్యూటరీకరించేప్పుడు ప్రైవేటు పట్టాభూములను భూదాన్ భూములుగా నమోదు చేశారు. మెయినాబాద్ మండలం కనకమామిడిలో ఈ వ్యవహారం కొన్నేళ్ల క్రితం జరిగింది. పట్టాభూములున్న రైతుల్లో కొందరు వాటిని విక్రయించేందుకు ప్రయత్నించగా... రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉన్నాయని.. విక్రయించేందుకు వీల్లేదని రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు చెప్పడంతో హతాశులయ్యారు. పరిష్కార మార్గాలకు ప్రయత్నిస్తుండగా.. ఒకరిద్దరు అధికారులకు దక్షిణ ఇస్తే పని పూర్తవుతుందని చెప్పడంతో రూ.లక్షల్లో సమర్పించుకొని ప్రైవేటు పట్టాలుగా మార్చుకున్నారు. డబ్బు ఇచ్చేందుకు శక్తిలేని వారు మాత్రం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

**గ్రామ రెవెన్యూ అధికారి నిర్వాకంతో...**

మెయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో వందల ఎకరాల్లో రైతుల భూములున్నాయి. వాటిని వారసత్వంగా సాగు చేసుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం అక్కడ గ్రామ రెవెన్యూ అధికారిగా రికార్డులను సక్రమంగా చూసుకోకపోవడం, కంప్యూటరీకరించేటప్పుడు పట్టాదార్ పాసుపుస్తకాలను సరిగా పోల్చుకోకపోవడంతో సుమారు 17 ఎకరాల పట్టాభూములను భూదాన్ రికార్డుల్లో నమోదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూములుగా ఉండడంతో భూదాన్ బోర్డు అధికారులు తమవేనంటూ తీసుకున్నారు. పహణీ రికార్డుల్లో రైతుల పేరిట పట్టాదార్ పాసుపుస్తకాలున్నా... ధరణి పోర్టల్‌లో తప్పుగా నిషేధిత భూములుగా నమోదు చేశారు. కరోనా ప్రభావంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రైతులు విక్రయించేందుకు ప్రయత్నించగా.. విషయం వెలుగులోకి వచ్చింది.

**డబ్బు ఇచ్చాక రికార్డుల్లో మార్పులు...**

తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతుండగా రెండేళ్ల క్రితం రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహించే ఓ అధికారి రూ.లక్షల్లో ముడుపులిస్తే రికార్డుల్లో మార్చేస్తారంటూ చెప్పారు. తొలుత నమ్మలేకపోయినా.. పొలం అమ్మితే డబ్బులొస్తాయన్న భావనతో కొందరు రైతులు ఆ అధికారి చెప్పిన మాటలు నమ్మారు. రూ.లక్షల్లో దక్షిణ సమర్పించుకున్నారు. రెవెన్యూ అధికారులు సవరణలు రాసి వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. పట్టా భూములను భూదాన్ భూములుగా ఓ అధికారి మార్చిన విషయంపై మెయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

## ఏళ్ల తరబడి అదే తీరు

పెద్దపల్లి : మిల్లులకు ధాన్యం కేటాయింపులు.. ప్రభుత్వానికి బియ్యం బకాయిలు.. సీఎంఆర్ అప్పగించేందుకు మిల్లర్లకు గడువు పొడిగింపు.. లక్ష్య సాధనపై అధికారుల సమీక్షలు.. ఇదీ ఏటా జరుగుతున్న తతంగం.. ప్రతి సీజన్‌లో మిల్లర్లకు నిర్దేశించిన లెవీ కోటా అలాగే ఉండిపోతూ ఏళ్ల తరబడి పాత బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వివాదాస్పదంగా మారిన 2018 ధాన్యం బకాయిలు పూర్తి చేయడానికి ప్రభుత్వం ఏటికేడు గడువు పొడిగిస్తూనే ఉంది. ఈ కోటాను పూర్తి చేయడానికి మరోసారి వచ్చే జనవరి 20 వరకు గడువు విధించారు. ఇవే కాకుండా 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రెండు సీజన్‌లకు చెందిన సీఎంఆర్ కోటా ఇప్పటికీ పూర్తి కాలేదు.

**వెంటాడుతున్న రెండేళ్ల నాటి బకాయిలు**

తాము బకాయి పడిన ధాన్యాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందనే ప్రచారంతో జిల్లాలోని పలువురు మిల్లరు బియ్యం అప్పగించకుండా ఉండిపోతున్నారు. 2022-23లో వేలం ద్వారా ధాన్యం దక్కించుకున్న గుత్తేదారులు మిల్లర్ల నుంచే సేకరించాల్సి ఉండటం సమస్యగా మారింది. మిల్లర్లు లెవీ కోటా పూర్తి చేయకుండా తమ వద్ద ఉంచుకున్న ధాన్యం కోసమే ప్రభుత్వం వేలం నిర్వహించింది. 2023-24 యాసంగి కోటాలో 69 శాతాన్ని మిల్లర్లు పూర్తి చేశారు. ఈ కోటా పూర్తి చేయడానికి ప్రస్తుతానికి సమయమున్నా 2022-23 యాసంగి బకాయిలు మిల్లర్లను వెంటాడుతున్నాయి.




**బాధ్యులపై చర్యలకు మీనమేషాలు**

లెవీ కోటా భర్తీలో నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై చర్యలకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ఏటికేడు బకాయిలు పెరిగిపోతున్నాయి. 2018-19లో కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకున్న 42 మంది మిల్లర్లను గుర్తించిన అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారు. అందులో కొందరు డబ్బులు చెల్లించడంతో నిషేధం ఎత్తివేశారు. 2019-20, 2020-21 కరోనా సీజన్, 2021-22లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ముదిరి లెవీ బియ్యం తీసుకోవడంలో జాప్యం జరిగింది. అప్పటి నుంచి తమ వద్ద పేరుకుపోయిన ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై కనీస చర్యలు లేకపోవడంతోనే ఏటా బకాయిల వసూళ్ల కోసం ప్రభుత్వం సమీక్షలు నిర్వహించడం పరిపాటిగా మారింది.

**కేటాయింపుల్లో వివక్ష**

తమకు కేటాయించిన ధాన్యంలో వంద శాతం లెవీ కోటాను పూర్తి చేసిన మిల్లర్లు జిల్లాలో అతి స్వల్పంగా ఉన్నారు.
ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మరాడించి బియ్యం ఇవ్వడానికి మరుసటి ఏడాది సీజన్ ప్రారంభం వరకు మిల్లర్లకు సమయం ఉంటుంది. గడిచిన వానాకాలం(2022-23)లో జిల్లాలో 96 శాతం సీఎంఆర్ కోటా పూర్తయింది. ఇదే స్థాయిలో 2023-24 వానాకాలానికి కేటాయింపులు జరగాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా జిల్లాలోని 55 శాతం మిల్లులకే కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022-23 యాసంగి కోటా పూర్తి చేయడానికి ఈ నెలాఖరు వరకు గడువుంది. ఆ సీజన్‌కు సంబంధించి బకాయి పడిన ధాన్యానికి ప్రభుత్వం బహిరంగ వేలం నిర్వహించడంతో బియ్యం కోటా పూర్తి చేయాల్సిన బాధ్యత మిల్లర్లపై లేకుండా పోయింది. బియ్యం అప్పగింతకు వేలంలో దక్కించుకున్న సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో 216 మిల్లులుంటే కేవలం 120 మిల్లులకే ప్రస్తుత సీజన్‌లో కేటాయించడం వివాదాస్పదమైంది. ఇందులో రారైస్(పొడి బియ్యం) మిల్లులు 16 మాత్రమే కావడం గమనార్హం.

## ఆక్రమణలు తొలగితేనే ఏటీసీకి స్థలం

సిరిసిల్ల : మారుమూల ప్రాంతంలో ప్రభుత్వ విద్యాసంస్థను ఏర్పాటు చేసి అక్కడి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచాలని వేములవాడ డివిజన్ రుద్రంగి మండల కేంద్రానికి ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఉత్తర్వులో చూపించిన సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు పరిశీలించగా ఆ స్థలంలో ఇప్పటికే నిర్మాణాలు ఉన్నాయి. ఏటీసీ నిర్మాణానికి పది ఎకరాలు అవసరం. కేజీబీవీ పక్కనున్న స్థలాన్ని పరిశీలించగా అది కూడా ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తొలగిస్తే తప్ప స్థల కేటాయింపులు జరిగేలా లేవు. దీంతో పాటు ఇప్పటికే రుద్రంగి మండలానికి ముప్పై పడకల ఆసుపత్రి కూడా మంజూరైంది. దీని నిర్మాణానికి ఎకరా పైగా స్థలం అవసరం ఉంది.

**ఆరు కోర్సులకు అవకాశం**

రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఏటీసీలో ప్రవేశాలకు అవకాశం ఉంది. ఈ సెంటర్‌లో రెండేళ్ల కాలపరిమితితో ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. అడ్వాన్స్ సీఎన్‌సీ, అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైన్ ఇన్ మెకానికల్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చర్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ వాహనాల మెకానిక్, మాన్యుఫ్యాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులకు 244 సీట్లు ఉన్నాయి. స్థల కేటాయింపు కొలిక్కి రావాలి. అప్పుడు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని బదలాయిస్తూ ఉపాధి శిక్షణ మండలికి పంపాలి. దాని ఆధారంగా వారు నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందిస్తారు. ఇవి పూర్తయితే శిక్షణకు అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రిని అందుబాటులోకి తెస్తారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే విప్ ఆది శ్రీనివాస్ జిల్లా అధికారులకు సూచించారు.

**యువతకు వరం**

జిల్లాలో రుద్రంగి మండల పరిధిలోనే ఎక్కువగా గిరిజన తండాలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడి యువతలో ఉన్నత చదువులు అంతంత మాత్రమే. చాలా వరకు ఇంటర్ చదువులకే పరిమితమయ్యారు. ఈ చుట్టుపక్కల గ్రామాల్లోని యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తుంటారు. అందులోనూ సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అక్కడ కూలీలుగా పని చేస్తుంటారు. ప్రభుత్వం ఏటీసీ కేంద్రం ఏర్పాటుతో వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల్లోని యువతలో నైపుణ్యాలు పెరుగుతాయి. ఫలితంగా మెరుగైన ఉపాధి లభించే అవకాశం ఉంది.

**స్థలం సిద్ధంగా ఉంది - ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్**

ఏటీసీకి కేటాయించాల్సిన స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి తొలగించేందుకు ఆదేశాలిచ్చారు. చదును చేశాక సర్వేయర్‌తో హద్దులు నిర్ధారించాల్సి ఉంది. రెండు చోట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఏటీసీకి, ముప్పై పడకల ఆసుపత్రికి రెండింటికి అవసరమైన స్థలం సిద్ధంగా ఉంది.

# సంక్షేమం కోరి..!

భానుపురి : సంక్రాంతి సందడిగా ముగిసింది. ఇక ప్రభుత్వ సంక్షేమ ఫలాల వైపు ఉమ్మడి నల్గొండ జిల్లావాసులు ఆసక్తిగా ఉన్నారు. పండగ అనంతరం పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను రాష్ట్రప్రభుత్వం సంక్రాంతి పండగ తర్వాత చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలపడంతో జిల్లా ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

**పదేళ్ల తర్వాత రేషన్‌కార్డులు**

ఉమ్మడి జిల్లాలో 10,07,011 రేషన్‌కార్డులు ఉన్నాయి. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్కసారి మాత్రమే పంపిణీ చేపట్టింది. ఆ తర్వాత జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగలేదు. ఇప్పటికే జిల్లాలో పేరు మార్పిడి, చేర్పుల వంటి వాటికి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 30 వేలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిని సంక్రాంతి తర్వాత ప్రభుత్వం చేపట్టనుంది.

**గృహయోగం**

పన్నెండు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు చేపడుతున్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ వెంటనే ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో లబ్ధిదారులను నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఆ తర్వాత దరఖాస్తుదారుల ఇళ్ల సర్వేను చేపట్టింది. మొదటగా నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల సర్వే 99 శాతం పూర్తయి ఎంపీడీవలోలు, పుర కమిషనర్లు క్రాస్



చెక్‌చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ కమిటీలు ఆమోదించిన వారికి కొత్తగా ఇళ్లు రానున్నాయి.

**రైతు భరోసా**

అధికారంలోకి వస్తే అన్నదాతలకు రైతుభరోసా ఇస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సాగుకు అనువైన భూములకు ప్రభుత్వం రైతు భరోసాను అందించనుంది. ఎకరాకు రూ.12వేల చొప్పున ఈ నెల 26న రైతు ఖాతాల్లో వేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సాయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

**వ్యవసాయ కూలీలకు**


ఉపాధి హామీ పథకంలో ఇరవై రోజులు పనిచేసి భూమి లేని కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో రూ.12 వేలు ఇవ్వనుంది. ఇప్పటికే అధికారులు ఉపాధి హామీ పనికి వెళ్లిన వారి వివరాలు సేకరిస్తున్నారు. ఏడాదికి రెండుసార్లు అంటే ఆరునెలలకోసారి రూ.6వేలు సంక్రాంతి తర్వాత ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో చాలామంది నిరుపేదలకు ఆసరా కానుంది.

**సన్న బియ్యం**

సంక్రాంతి తర్వాత సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 10,07,011 రేషన్‌కార్డులు ఉన్నాయి. కొనుగోలు చేసిన సన్న బియ్యం మిల్లింగ్ చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వం సమయం తీసుకొని పంపిణీ చేయనుంది. ఈ పథకాలన్నీ సంక్రాంతి తర్వాత అమలు కానుండటంతో ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# చివరి దశలో నాటు

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టులో వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. కాలువ చివరి భూముల రైతులు ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల అక్కడ ఆలస్యమయ్యాయి. సాగర్ ఎడమ కాలువ ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో విస్తరించి ఉంది. సూర్యాపేట జిల్లాలో ఆయకట్టు చివరి ప్రాంతాల రైతులు వరినాట్లు ఆలస్యంగా వేశారు. ప్రస్తుతం దాదాపు పూర్తి కావొచ్చాయి. సాగు చేసుకునేందుకు నీటి పారుదలశాఖ డిసెంబరు 15 నుంచి జనవరి 12 వరకు సాగునీటిని విడుదల చేసింది. సాగునీరు మొదటి దఫా పూర్తయ్యేసరికి వరినాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఈనెల 11 నుంచి సాగు నీటిని వారం పాటు బంద్ చేశారు. తిరిగి 19 నుంచి జనవరి 29 వరకు రెండో దఫా నీటిని విడుదల చేస్తారు.



**సాగర్ ఆయకట్టులో..**

నల్గొండ జిల్లాలో 1,56,456 ఎకరాల ఆయకట్టు ఉంది. దాదాపు పూర్తి స్థాయిలో వరి నాట్లు పడినట్లు అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 2,29,206 ఎకరాల ఆయకట్టు ఉంది. దాదాపు 90 శాతం మేరకు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పది శాతం ఆయకట్టులో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా రెండు రోజులు విరామం వచ్చినప్పటికీ తిరిగి బుధవారం వారినాట్లు వేసుకోవడం కన్పించింది. ఇవే కాకుండా కాలువ వసతి లేని రైతులు బోర్లు, బావులు, ఎత్తిపోతల కింద దాదాపు పూర్తి చేశారు.

**కొరతను అధిగమిస్తూ..**

కూలీలు ఈసారి నాటు రేట్లు పెంచడంతో ఇబ్బందులు పెరిగాయి. రైతులు చల్లుడు పద్ధతిలో, డ్రమ్మ్‌సీడర్ విధానంలో నాట్లు వేసేందుకు మొగ్గు చూపారు. దీనికి తోడు పలు ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు కూడా నాట్లు వేయడంతో కొరతను అధిగమించినట్లయింది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ కొందరు రైతులు నాటు ఖర్చులు తగ్గించుకునేందుకు చల్లుడు పద్ధతి వైపు మొగ్గు చూపారు. నాట్లు పూర్తి కావచ్చినప్పటికీ చాలా ప్రాంతాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

# షట్టర్ల బిగింపులో జాప్యం



సారంగాపూర్ : బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు ప్రారంభించిన బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తేనే షట్టర్ల బిగింపు సాధ్యం కానుంది. ఇందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. 2016లో 0.25 టీఎంసీ సామర్థ్యం నుంచి 1 టీఎంసీకి పెంచేందుకు రూ.65 కోట్లతో ప్రారంభించిన ఆధునికీకరణ పనుల అంచనాలు పెరిగి రూ.136 కోట్లకు చేరుకొన్నాయి. అయినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఎదురు చూపులు తప్పడంలేదు. ఆధునికీకరణ పనులు పూర్తయితే 11 వేల ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం 20 వేల ఎకరాలకు పైగా పెరుగుతుందని భావించినా పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందిగా మారుతోంది.

**రూ.70 లక్షలతో అంచనాలు** రోళ్లవాగు ఆధునికీకరణ పనులు 95 శాతం మేర పూర్తి చేశారు. అటవీశాఖకు రెవెన్యూ భూమి అప్పగింతలో జాప్యం, వర్షాలు తదితర కారణాలతో ఏళ్లుగా పనులు సాగుతున్నాయి. ఆధునికీకరణ పనుల కోసం రూ.110 కోట్లు వ్యయం చేస్తుండగా మిగతా నిధులు భూ సేకరణ తదితర అవసరాలకు వినియోగించారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు మూడు చోట్ల షట్టర్లు బిగించాల్సి ఉంది. షట్టర్లకు దాదాపు రూ.70 లక్షలు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు. తూముల వద్ద కంకర నిర్మాణం, ప్లాట్‌ఫాం తదితర పనులు పూర్తి కాకపోవడంతో షట్టర్ల బిగింపులో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఆయకట్టు రైతులకు నీరు విడుదల చేస్తుండడంతో తూము షట్టర్ల పనులు చేపట్టడం కష్టంగా ఉండనుంది. పనులు పూర్తి చేసిన తరువాతనే షట్టర్లు తయారు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. **335 హెక్టార్ల రెవెన్యూ భూములు అవసరం**

తూములకు షట్టర్ల బిగింపు ఆలస్యం అవుతుండడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. 0.25 టీఎంసీ సామర్థ్యం మేరకు నీటి నిలువ చేసుకునేందుకు అటవీ అధికారులకు అభ్యంతరం ఉండదని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులకు 335 హెక్టార్ల రెవెన్యూ భూములు పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి ఆయకట్టు రైతులకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం తూము వద్ద తాత్కాలికంగా షట్టర్ ఏర్పాటు చేసినప్పటికీ తీయడం, పెట్టడం అధికారులకు కష్టంగా మారింది. శాశ్వత షట్టర్ల బిగింపు పూర్తయితేనే 1 టీఎంసీ నీటిని నిలువ చేసుకునే అవకాశం ఉండడమే కాకుండా చివరి ఆయకట్టు రైతులకు నీరందించే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.


**జూన్ వరకు గడువు పొడిగింపు**

గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు గుత్తేదారుకు పనులు చూపించకపోవడంతో ఇప్పటికే నాలుగు సార్లు పొడిగించారు. గతేడాది డిసెంబరుతో గడువు ముగియడంతో జూన్ 2025 వరకు పొడిగించారు. అప్పటి వరకు గుత్తేదారు ఆధునికీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.110 కోట్లు కాగా ఇందులో ఇప్పటి వరకు రూ.102 కోట్ల పనులు పూర్తి చేశారు. ఇందులో గుత్తేదారుకు రూ.98 కోట్లు చెల్లించినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. **ఆయకట్టుకు ఇబ్బందుల్లేకుండా చర్యలు**

బీరపూర్, ధర్మపురి మండలాల రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 12ఎల్ ద్వారా ప్రాజెక్టులోకి నీటిని తరలించి ఆయకట్టుకు విడుదల చేస్తున్నాం. ఆయకట్టు చివరి భూములకు కూడా నీరందించేలా ప్రణాళిక తయారు చేశాం. నీటి విడుదల కొనసాగుతున్నందున తూముల వద్ద పనులు చేపట్టడం ఇబ్బందిగా ఉన్నందున షట్టర్ల బిగింపు ఆలస్యమవుతోంది.

– చక్రనాయక్, డీఈఈ నీటిపారుదల శాఖ

# ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం



పెద్దపల్లి : పంటల సాగులో విచ్చలవిడిగా రసాయనాల వాడకం ప్రజారోగ్యానికి పెను విపత్తుగా మారింది. ఒకప్పుడు ఎనభై ఏళ్ల వయసులోనూ ఆరోగ్యంగా ఉంటే, ఇపుడు నలభైల్లోనే వ్యాధులు చుట్టుముడుతున్నాయి. తీసుకునే ఆహారంలో రసాయన అవశేషాలు అధికంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛమైన, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లకు డిమాండ్ పెరుగుతోంది. విపణి అవసరాలు, ప్రజారోగ్యం దృష్ట్యా కొంతమంది రైతులు ప్రకృతి సేద్యాన్ని నమ్ముకున్నారు. సేంద్రియ ఎరువులు వాడుతూ పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకుంటున్నారు. ఆధునిక పద్ధతుల్లో లాభసాటి ప్రకృతి, గో ఆధారిత వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. అధిక దిగుబడులు సాధిస్తూనే స్వచ్ఛమైన పంటలను ఉత్పత్తి చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి కూడా తుగ్గుతుందని చెబుతున్నారు.

**విచ్చలవిడి ఎరువులతో నేల నిస్సారం**

పంటల్లో చీడపీడలు, తెగుళ్ల నివారణకు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దిగుబడులపై ఆశతో మోతాదుకు మించి వాడుతున్నారు. దీంతో నేల నిస్సారమవడమే కాకుండా, మేలు చేసే క్రిమికీటకాలు చనిపోతున్నాయి. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తుల్లో నాణ్యత, రుచి లోపిస్తోంది. పోషకాలూ అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. వీటిని కడిగి తినకపోతే అనారోగ్యం బారిన పడతాం. పురుగు మందులు, ఎరువులతో రైతులకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రైతులు**

ఉమ్మడి జిల్లాలో సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసే రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రసాయనాలు వాడకపోవడంతో పెట్టుబడుల ఖర్చు తగ్గి.. లాభాలు పెరుగుతున్నాయి. వర్మి కంపోస్టు, పశువుల పేడ, గోమూత్రం, వేప గింజల కషాయం, పంచగవ్య, జీవామృతం వంటి ఎరువులతో తెగుళ్లను నియంత్రిస్తున్నారు. సేంద్రియ పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ధాన్యం, పండ్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఉత్సాహం చూపుతున్నారు.

**ఇరవై నాలుగేళ్లుగా సాగు**

పాలేకర్ సదస్సులకు వెళ్లి సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ఆకర్షితుడినయ్యా. ఆరెకరాల్లో మిర్చి, పత్తి, వరి, మినుములు, నువ్వులు సాగు చేస్తున్నా. ఇరవై నాలుగేళ్లుగా రసాయన ఎరువులను వాడకుండా పశువుల పేడ, వేప చెట్ల కషాయాతో ఎరువులు తయారు చేసి పంటలకు పిచికారీ చేస్తున్నాను. దిగుబడులు బాగానే వస్తున్నాయి. గానుగతో పల్లి, కొబ్బరి నూనె తయారు చేస్తూ ఆదాయం పొందుతున్నా.– సుధాకర్, పెర్కపల్లి, సుల్తానాబాద్ మండలం

**పండ్లకు హైదరాబాద్‌లో మంచి డిమాండ్**

భావితరాలకు మేలు చేసేందుకు నా వంతుగా సేంద్రియ ఎరువులతో మామిడి, అరటి, బొప్పాయి, దానిమ్మ తదితర తోటలు సాగు చేస్తున్నా. గోశాలలోని పేడ, గోమూత్రం, సహజసిద్ధమైన చెట్లతో తయారు చేసిన ఎరువులు వినియోగిస్తున్నా. పండ్లకు హైదరాబాద్‌లో మంచి డిమాండ్ ఉంది. –ప్రభాకర్, రైతు, ధర్మారం, కోనరావుపేట మండలం

**మితిమీరిన రసాయనాలతో వ్యాధులు**

పండ్లు, కూరగాయలు తదితర పంట ఉత్పత్తుల్లో మితిమీరిన రసాయనాలు వాడితే క్యాన్సర్, ఊపిరితిత్తులు, జీర్ణకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆ పద్ధతిలో పండిన పంటల్లో పోషకాలు పెద్దగా ఉండవు. సేంద్రియ ఎరువులతో పండించిన పంట ఉత్పత్తుల్లో పోషకాలు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. సంపూర్ణ ఆరోగ్యం కోసం రసాయన అవశేషాలు లేని పంట ఉత్పత్తులే ఉత్తమం.– డా.రోహిత్, ఫిజీషియన్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

**రైతులను ప్రోత్సహించాలి**రెండెకరాల పొలంలో పదేళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నా. వరిలో తెగుళ్ల నివారణకు రసాయన ఎరువులు వినియోగించడం లేదు. ఆవు పేడ, గోమూత్రం, వర్మి కంపోస్టు ఎరువులతో పండిస్తున్నా. సేంద్రియ పంటలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలి.– బాపురెడ్డి, జైన, ధర్మపురి మండలం

# అమ్మకానికి హౌసింగ్ బోర్డు స్థలాలు.. మూడు డివిజన్ల పరిధిలో 73 ప్లాట్లు

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో కొన్నేళ్లుగా అక్కడక్కడా మిగిలిపోయిన హౌసింగ్ బోర్డు స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. మూడు డివిజన్ల పరిధిలోని 73 ప్లాట్లను విక్రయానికి పెట్టింది. అన్నీ కలిపి 4,880.98 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి. అతితక్కువగా 6.11 చదరపు గజాలు, అత్యధికం 290 చదరపు గజాలు ఉన్నాయి. కేవలం 15 స్థలాలు మాత్రమే వంద చదరపు గజాలు, అంతకుమించి ఉన్నాయి. ఇవి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోనే నాలుగు ఫేజుల్లో ఉన్నాయి. గతంలో వేలం వేసిన సందర్భంగా చిన్న చిన్న ప్లాట్లు మిగిలిపోయాయి. వీటితోపాటు గతంలో నిర్వహించిన వేలంలో కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాని వాటిని తాజాగా గుర్తించి విక్రయానికి పెట్టారు. వాటి విక్రయం ద్వారా రూ.60 కోట్ల నుంచి రూ. 65 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. ఈ నెలలో రెండు దఫాలుగా 31, వచ్చే నెల అయిదో తేదీన మిగిలిన 42 స్థలాలను వేలం వేయాలని నిర్ణయించారు. **మార్చిలో మరోసారి...** ఈ ఏడాది మార్చిలో మరోసారి పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్న ప్లాట్లు, ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్తులను వేలం వేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం స్వల్ప విస్తీర్ణంతోపాటు కొన్నేళ్లు ఖాళీగా ఉన్న వాటిని విక్రయించటం ద్వారా ఆయా ఫేజుల్లో వేలం ప్రక్రియ పూర్తి చేసినట్లు అవుతుందన్న అభిప్రాయాన్ని ఓ ఉన్నతాధికారి తెలిపారు. మార్చిలో సుమారు రెండు వేలకు పైగా స్థలాలు వేలం పరిధిలోకి తీసుకురానున్నట్లు వివరించారు.

# అమ్మో.. గుర్రపుడెక్క..!

రామన్నపేట : గుర్రపుడెక్క.. ఈపేరు వింటేనే మూసీ పరివాహక రైతులు, మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. దీని కారణంగా ఏటి కాల్వతో పాటు యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఆసిఫ్‌నహర్ కాల్వల్లో సాగునీరు పలు ప్రాంతాల్లో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.



**మత్స్యకారులకు జీవనాధారం**

మూసీ కాల్వలు వందలాది మత్స్యకారుల కుటుంబాలకు జీవనాధారంగా మారాయి. ఆసిఫ్‌నహర్, ఏటి కాల్వల్లో గుర్రపు డెక్క సమస్య తీవ్రంగా ఉంది. శోభనాద్రిపురం వద్ద మూసీ నది నుంచి మునిపంపుల చెరువు వరకు ఏటికాల్వ నిర్మాణం జరిగింది. దీని ద్వారా 500 ఎకరాలకు పైగా సాగునీరందుతోంది. ఈ కాల్వలు ప్రస్తుతం గుర్రపుడెక్కతో నిండి సాగునీరు ముందుకు సాగడం లేదు. గుర్రపుడెక్క సమస్య రామన్నపేట, వలిగొండ తదితర మండలాల్లో అధికంగా కన్పిస్తోంది. అనేక చోట్ల కాల్వలు, చెరువులు పూర్తిగా గుర్రపు డెక్కకు నిండి పచ్చని మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి.

**ప్రయోగాత్మకంగా...**

వలిగొండ మండలం నెమలికాల్వ నుంచి నీర్నెంల శివారు వరకు 20కి.మీ.లను మొదటి విడతగా గుర్రపుడెక్క తొలగింపునకు ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేసింది. అధికారులు రెండు వారాల క్రితం ప్రయోగాత్మకంగా డ్రోన్ సాయంతో కాల్వలో రసాయనాలు పిచికారీ చేశారు. అనంతరం హిటాచితో తొలగించే పనులు చేపట్టనున్నారు.

**చర్యలు చేపట్టాం... సంతోశ్, ఏఈ, నీటిపారుదల శాఖ, రామన్నపేట**

తొలి విడతగా గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియ చేపట్టాం. ఇది విజయవంతం అయితే రెండో విడత చేపడతాం. దీంతో పాటు ఏటి కాల్వ తదితర కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు చర్యలు తీసుకుంటాం.

# లక్ష్యం ఘనం.. ఆచరణ భిన్నం

మునగాల : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పంపిణీ చేసిన చెత్తడబ్బాల వినియోగం అంతగా ఉండటం లేదు. స్వచ్ఛభారత్‌లో భాగంగా 2019లో జిల్లాలో ప్రతి ఇంటికీ రెండు చొప్పున ఈ డబ్బాలు అందించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్లకు అందించాలి. ఆ చెత్తను వేర్వేరుగా తీసుకెళ్లి వర్మీ కంపోస్టు ఎరువుల తయారీకి చర్యలు తీసుకునేలా ప్రకియను రూపొందించారు. ఈ విధానం ఆరంభంలో కొంత వరకు ఫలితాన్ని ఇచ్చినా తరువాత ముణ్నాళ్ల ముచ్చటగా మారింది.

**పరిస్థితి ఇది..**

దాదాపు ప్రతి గ్రామపంచాయతీలో 2019లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. అదే సమయంలో ప్రతి ఇంటికీ రెండు చెత్త వేసే డబ్బాలను పంపిణీ చేశారు. డబ్బాలు పగిలి మూలన పడ్డాయి. ప్రస్తుతం ప్రజలు చెత్తకోసం సంచులు, ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లలో వేరు వేసి సేంద్రియ ఎరువు తయారు చేయకుండా, డంపింగ్ యార్డులకు తరలించి తగలబెడుతున్నారు. దీంతో వాతావరణ కాలుష్యంతో పాటు, ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

**నిలిచిన వర్మీ కంపోస్టు..**తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలనే అంశాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది గాలికి వదిలేసింది. తడిచెత్తతో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో కొన్ని పంచాయతీల్లో వర్మీ కంపోస్టు తయారు చేసినా, ప్రస్తుతం దాదాపు ఎక్కడా తయారు చేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు సక్రమంగా రాకపోవడంతో వారు కేవలం చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అక్కడ వేరుచేసే ప్రక్రియ చేపట్టడం లేదు. చెత్త డబ్బాలను గతంలోనే పంపిణీ చేశారని, మళ్లీ పంపిణీకి ఆదేశాలు రాలేదని ఎంపీడీవో రమేశ్ దీన్‌దయాల్ తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియపై దృష్టి పెడతామని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

# జోరుగా యాసంగి సాగు

మెదక్: మెతుకుసీమలో యాసంగి పంటల సాగు జోరుగా కొనసాగుతోంది. జిల్లాలో ఎక్కువగా బోర్ల కిందనే పండిస్తున్నారు. ఈ సీజన్‌లో బోర్లతో పాటు తైబందీ జరిగిన చెరువుల ప్రాంతాల్లో పంటలను పండిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయనున్నడంతో వాటి పరిధిలో సాగు చేస్తున్నారు. ఎక్కువగా వరికే అన్నదాతలు మొగ్గుచూపుతున్నారు.



**ఘనపూర్ కింద 25వేల ఎకరాలు**

జిల్లాలో యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి 2,84,836 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరి, శనగ, జొన్న, మొక్కజొన్న తదితర పంటలను ఎక్కువగా వేస్తుంటారు. ఈ సీజన్‌లో పంటల సాగు ముగింపు దశకు చేరుకునే లోపు ఎక్కువ నీటి వాడకం అవసరం కావడంతో అన్నదాతలు ముందుగా బోర్ల కిందనే పంటలు వేశారు. ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపూర్ కింద సుమారు 25వేల ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశారు. పలు విడతల్లో నీళ్లను ఆనకట్ట నుంచి దిగువకు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు నిర్ణయించారు. ఆనకట్ట పరిధిలోని రైతులు ఇప్పుడిప్పుడే సాగు పనులు మొదలు పెట్టారు.

**80,103 ఎకరాల్లో....**

ప్రస్తుత యాసంగిలో అన్ని రకాల పంటల సాగు లక్ష్యం 2.84లక్షలు కాగా, ఇప్పటి వరకు 80,103 ఎకరాల్లోనే సాగయ్యాయి. ఇందులో వరి అత్యధికంగా 75,000 ఎకరాల్లో, జొన్న 3,047 ఎకరాలు, మొక్కజొన్న 1,669 ఎకరాల్లో సాగు చేశారు. వరి నాట్లు కొనసాగుతున్నందున పంటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. చలి అధికంగా ఉండడంతో ప్రభావం చూపుతోంది. 2023–24 యాసంగిలో 2,73,801 ఎకరాల్లో అన్ని రకాల పంటలను వేశారు.

# సైకిల్ ట్రాక్ అంతర్జాతీయం.. నిర్మాణం నాసిరకం

హైదరాబాద్: భారీ ఎత్తున ప్రజాధనం ఖర్చు పెట్టి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించామని చెప్పుకున్న అవుటర్ రింగ్‌రోడ్డు సైకిల్‌ట్రాక్.. నాణ్యత డొల్లతనం బయట పడుతోంది. వట్టినాగులపల్లివద్ద తాజాగా మరోసారి సైకిల్‌ట్రాక్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రంగంలోకి దిగిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) అధికారులు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో పగుళ్లు రావడంతో పూడ్చివేశారు. గత అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా పనులు చేపట్టడంతో ఆ ప్రభావం నాణ్యతపై పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వట్టినాగులపల్లి నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేరకు గతంలో జలమండలికి చెందిన 3500 ఎంఎండయా నీటి పైపులైన్ ఏర్పాటుచేశారు. దాని పైనుంచే సైకిల్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఓవైపు పైపులైన్ పనులు జరుగుతుండగానే.. హడావుడిగా ట్రాక్ నిర్మించారు. పైపులైన్‌కు తవ్విన భారీ ట్రెంచ్ పూడ్చివేతలో శాస్త్రీయత లేకుండా పనులు చేయడంతోనే ట్రాక్‌కు ముప్పు ఏర్పడిందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు వ్యాఖ్యానించడాన్ని బట్టి.. పనుల్లో నాణ్యత తీరు స్పష్టమవుతోంది. పైపులైన్ పొడవునా నిత్యం ఎక్కడో ఒకచోట



పగుళ్లు ఏర్పడుతున్నాయి. అవి పెద్దవైతే కింద ఉన్న పైపులైన్ మనుగడ కష్టమని చెబుతున్నారు. భారీ పైపులైన్ కావడంతో జాయింట్లవద్ద ఎక్కడైనా లీకేజీ ఏర్పడి నీళ్లు పైకి ఉబికి వస్తే.. ఆ పరిధిలో సైకిల్‌ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదముందని అంటున్నారు.

**కిలోమీటర్‌కు రూ.3.91 కోట్ల వరకు...**

అవుటర్ చుట్టూ 23 కిలోమీటర్ల పరిధిలో సైకిల్ ట్రాక్ నిర్మించారు. నానక్‌రాంగూడ నుంచి పోలీస్ అకాడమీ వరకు 8.5, నార్సింగి నుంచి కొల్లూరు 14.5 కి.మీ.మేర ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.90 కోట్లు వెచ్చించారు. అంటే ప్రతి కిలోమీటర్‌కు దాదాపు రూ.3.91 కోట్లు చొప్పున వెచ్చించారు. ట్రాక్ మొత్తం సోలార్ రూఫ్‌టాప్ నిర్మించి 16 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. రాత్రి కూడా సైక్లింగ్ చేసేలా లైటింగ్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. సోలార్ విద్యుదుత్పత్తి 10-13 మెగావాట్లకు దాటడం లేదని తెలుస్తోంది. ట్రాక్ నాణ్యతపై హెచ్ఎండీఏ అధికారులను వివరణ కోరగా.. పైపులైన్ పనుల తర్వాత ట్రెంచ్ పూడ్చటంలో జలమండలి సరైన ప్రమాణాలు పాటించకపోవడంతోనే పగుళ్లు వస్తున్నాయన్నారు. పగుళ్లు వచ్చిన చోట సిమెంటుతో పూడ్చుతున్నామన్నారు.

# మరమత్తుకు ఆసరా

ముస్తాబాద్ : ఈ చిత్రంలోని రామగిరి మండలం కల్వచెర్ల పీహెచ్‌సీ నిర్మాణాన్ని 2008లో రూ.6.50 లక్షలతో మొదలుపెట్టారు. అనంతరం నిధులు సరిపోక కొన్నేళ్లు అసంపూర్తిగానే వదిలేశారు. గతేడాది మరో రూ.5.50 లక్షలతో పల్లె దవాఖానా పేరిట మిగిలిన పనులు పూర్తిచేసి ఆస్పత్రిని ప్రారంభించారు. కిటికీలకు, వైద్య సామగ్రికి ప్రస్తుతం రూ.7.50 లక్షలు కేటాయించగా.. రోగులకు సేవలు మెరుగుపడనున్నాయి.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్: పగుళ్లుబారిన గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. అస్తవ్యస్తమైన విద్యుత్తు వ్యవస్థ.. నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు.. ఇది జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, వసతి గృహాల పరిస్థితి. ఈ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటివరకు పలు కారణాలతో అరకొర వసతులతో ఉన్న వాటికి మరమ్మతులకు తన కోటా కింద రూ.11.14 కోట్లు ఇటీవల కేటాయించారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షించనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

**బడుల ప్రగతికి ప్రాధాన్యం**

ప్రభుత్వ బడుల్లో భవనాలు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతుల్లో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. పైకప్పులు ప్రమాదకరంగా మారి పెచ్చులూడుతున్నాయి. వర్షాలకు బడులకు సెలవు ఇవ్వాల్సి పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల



అసంపూర్తి ప్రహరీ నిర్మాణంతో పశువులు, పందుల, ఆకతాయిల సంచారంతో అసౌకర్యం కలుగుతోంది. జిల్లాలో ఏయే పాఠశాలల్లో ఈ సమస్య నెలకొందో అక్కడ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

**కలెక్టర్ సందర్శన.. సమస్యలు గుర్తింపు**జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విరిగిన కిటికీలు, తలుపులతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మూత్రశాలలకు తలుపులు లేక ఇబ్బంది పడుతు న్నారు. పగుళ్లు బారిన నేలతో ప్రమాదం పొంచి ఉంది. కలెక్టర్ వసతి గృహాల సందర్శనలో భాగంగా సమస్యలు గుర్తించి.. వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేశారు. దీంతో ఎట్టకేలకు విద్యార్థులు సమస్యలు దూరం కానున్నాయి.

**పల్లె వైద్యానికి భరోసా**

ప్రాథమిక, ఉపవైద్య కేంద్రాల్లో అరకొర వసతులతో రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సరిపడా పరికరాలు లేక వైద్యులు పట్టణ ప్రాంతాలకు సిఫార్సు చేస్తున్నారు. కొన్నిచోట్ల కొత్త భవనాలు ఉన్నప్పటికి చిన్న చిన్న సమస్యలతో సేవలు అందడం లేదు. ప్రస్తుతం కలెక్టర్ కోటా నిధులతో మరమ్మతులు చేయాల్సిన ఆరోగ్య కేంద్రాలను బాగు చేయనున్నారు. ఆధునిక పరికరాలు తెప్పించనున్నారు.

# నీటిబొట్టు.. అందితే ఒట్టు!



కరీంనగర్ : కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి-94 కాలువ గుండా నీరందక యాసంగి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డి-94 మల్కాపూర్ వద్ద ప్రారంభమయ్యే కాలువకు ఆరు వందల క్యూసెక్కుల నీరు రావాల్సి ఉంది కానీ.. ప్రస్తుత యాసంగిలో మూడు వందల నుంచి నాలుగు వందల క్యూసెక్కుల నీరే వస్తోంది. దీంతో చివరి ఆయకట్టు గ్రామాలైన చేగుర్తి, దుర్శేడు, గోపాల్‌పూర్ తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలకు నీరందటం లేదని రైతులు చెబుతున్నారు.

**రైతుల్లో ఆందోళన**

వచ్చిన నీటిని ఎగువ రైతులే మరల్చుకుంటుండంతో తమ ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. కాలువ నీటి ఆధారంగా పంటలు సాగు చేసిన రైతులు ఇతర రైతుల బావుల నుంచి పైపులైన్ల ద్వారా పంటలకు నీరందజేస్తున్నారు. 30 శాతం మంది రైతులు కాల్వ నీటి ఆధారంగా మొక్కజొన్న, కూరగాయలు, వరి తదితర పంటలు సాగు చేస్తుంటారు. మొదట్లోనే కాల్వ నీరు సక్రమంగా అందటం లేదంటే ఏప్రిల్ 2 వరకు సక్రమంగా అందుతుందా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకొని తమ పంటలకు సక్రమంగా నీరందేలా చూడాలని కోరుతున్నారు. సాగునీటి సమస్యపై నీటిపారుదల శాఖ డీఈఈ సంతోశ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఎగువ రైతులు దిగువకు నీరు వదలాలని చెబుతున్నామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

**కాలువ నీరే ఆధారం**

కాలువ నీరు వస్తుంది కదా అని దుర్శేడు గ్రామ శివారులో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. బావి నీటితో మొత్తం పొలం పారటం లేదు. చాలా మంది రైతులం కాలువ నీటి ఆధారంగా పంటలు సాగు చేసి నీటి కోసం ఎదురుచూస్తున్నాం. కలెక్టర్ చొరవ చూపాలి.

– అనుముల మహేందర్, రైతు, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణ మండలం

**కాలువలపై పట్టింపేదీ?**

ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా నారాయణాపూర్ జలాశయాన్ని నింపి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు సాగునీటిని అందించేందుకు కాలువలు నిర్మించారు. ఏళ్లుగా నిర్వహణ కొరవడి, మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువల్లో పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. యాసంగి పంటలకు నీటిని అందించేందుకు బుధవారం ఎల్లంపల్లి నుంచి నీటిని పైపులైన్ల ద్వారా విడుదల చేశారు. రెండేళ్ల కిందట నారాయణపూర్ చెరువులోని మట్టిని ఇటుక బట్టీలకు అక్రమ రవాణా చేసిన సమయంలో లారీలు వెళ్లేందుకు దారిని విస్తరించారు. బండరాళ్లు కాలువలో పడేసి ధ్వంసం చేశారు. దీంతో కాలువ కుచించుకుపోయి నీటి ప్రవాహం ఇబ్బందిగా మారింది. ఎడమ కాలువ ద్వారా మండలంలోని చర్లపల్లి ఎన్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, కొండాయపల్లి, కుర్మపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి ఆర్ గ్రామాలతోపాటు మల్యాల, కొడిమ్యాల, రామడుగు మండలాల్లోని ఆయా గ్రామాలకు సాగునీటిని అందిస్తారు. ప్రధాన, ఉప కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లతో నీటి విడుదలలో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటీవల ఇదే సమస్యపై ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సాగునీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తాకు వివరించారు. సమస్య పరిష్కారానికి సత్వర కృషి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

# నాలుగో నగరం ప్రణాళికలు వేగిరం.. ఐటీ సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు



హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు, పరిశ్రమలను స్థాపించేందుకు ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. నాలుగో నగరం చుట్టూ వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని, విమానాశ్రయానికి దగ్గరగా మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే అధికారులు పరిశీలించారు. రెండు జిల్లాల్లో ఆరు మండలాల్లో కొన్ని గ్రామాలను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. గతంలో పరిశ్రమలకు స్థలాలిచ్చి కార్యకలాపాలు కొనసాగించకపోతే వాటిని వెనక్కితీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని నిర్ణయించారు.

**పరిశ్రమలు... టెక్స్‌టైల్స్**

నాలుగో నగరానికి పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో పరిశ్రమలు, టెక్స్‌టైల్ హబ్‌లను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఐటీ, పరిశ్రమల హబ్‌లతో పాటు విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే నాలుగైదేళ్లలో అక్కడ కూడా అభివృద్ధి వేగవంతమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఐటీ, పరిశ్రమల స్థాపనకు ముందే రహదారులు నిర్మించడం, మొక్కలు నాటడం వంటివి చేపట్టనున్నామని అధికారులు వివరించారు.

**అన్ని అవసరాలకు అనుకూలంగా..**

ఐటీ సంస్థలు, పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం కేటాయించే భూములన్నీ అన్ని అవసరాలకు అనుకూలంగా ఉండేలా అధికారులు చూస్తున్నారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల పరిధుల్లో ప్రభుత్వ స్థలాల వివరాలను సేకరించారు. ఒక్కో ప్రాంతంలో కనీసం వెయ్యి ఎకరాలు సేకరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సెజ్ తరహాలో ఒకేచోట 200, 300 ఎకరాలు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసముండేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

# అంకురాలకు విదేశీ సంస్థల ప్రోత్సాహం

హైదరాబాద్ : ఐటీ హైదరాబాద్‌లలో పరిశోధనలు చేస్తున్న అంకుర సంస్థలపై విదేశీ సంస్థల ప్రతినిధులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రాణాధార మందుల తయారీ, ఇంజినీరింగ్ బయాలజీ, సెమీకండక్టర్ల రూపకల్పన రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండేళ్లలో రూ.250 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఆస్పైర్- బయోనెస్ట్‌లో పరిశోధనలు చేస్తున్న అంకుర సంస్థలతో అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ప్రత్యేక పరిశోధన కేంద్రంలోని అంకురాలతో అమెరికా, ఐరోపా దేశాల కంపెనీలు చర్చిస్తున్నాయి.

**రూపకల్పన... మార్కెటింగ్ వ్యూహాలు**

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న అంకుర సంస్థల్లో పెట్టుబడి పెడుతున్న విదేశీ సంస్థలు ఆయా సంస్థలు రూపొందిస్తున్న ఆవిష్కరణలు, వస్తువుల తయారీ, సాఫ్ట్‌వేర్ రూపకల్పన వంటి అంశాల్లో సలహాలు ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ వ్యూహాల్లోనూ చేదోడుగా ఉంటున్నాయి. పేటెంట్ దరఖాస్తులు, వస్తువుల తయారీకి పరిశ్రమలను గుర్తిస్తున్నాయి. ప్రధానంగా క్యాన్సర్ చికిత్సల్లో రోగులకు ఇస్తున్న మందుల తయారీలో కొత్త ప్రమాణాలు, తక్కువ ధరలో బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణం, కాలుష్యం తగ్గించే భవన నిర్మాణాల వంటి వాటికి విదేశీ ప్రతినిధులు ప్రాధాన్యమిస్తున్నారు. విదేశాల్లో పరిశోధనలతో పోల్చితే ఇక్కడ ఉత్పత్తి ఖర్చు తక్కువగా ఉండటం, వినియోగదారులు ఎక్కువగా ఉండడంతో ఇక్కడి అంకుర సంస్థలకు ప్రాధాన్యమిస్తున్నారు.

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు..**

అంకుర సంస్థల ఏర్పాటు ద్వారా విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామి



కవేత్తలుగా ఎదిగేందుకు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో లీడర్స్ ఇన్ ఇన్నోవేషన్ ఫెలోషిప్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఇంజినీరింగ్ విద్యార్థులు, ఎంటెక్, పీహెచ్‌డీ పరిశోధకుల్లో సృజనను వెలికితీయడం దీని ప్రత్యేకత. ఇందులో చురుగ్గా పాల్గొంటున్న వారికి ట్రిపుల్‌ఐటీ ఆచార్యులు శిక్షణ ఇస్తున్నారు. కృత్రిమమేధ, ఇంజినీరింగ్ బయాలజీ, సెమీకండక్టర్స్, భవిష్యత్ టెలికాం రంగం, క్వాంటమ్ పరిజ్ఞానం వంటివి ఇందులో ఉన్నాయి. విద్యార్థులు, పరిశోధకులు వీటిపై పరిశోధనలు నిర్వహించి ఫలితాలు వచ్చాయని నివేదిస్తే.. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆచార్యులు అంకుర సంస్థలు స్థాపించేందుకు ప్రోత్సహిస్తున్నారు.

# కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

రామగుండం : రామగుండం నగరపాలక ప్రాంతంలోని వీర్లపల్లి గ్రామం కాలుష్యకోరల్లో చిక్కుకొని సతమతమవుతోంది. వాయు కాలుష్యంతో పాటు ఎరువుల కర్మాగారం నుంచి వెలువడే భారీ శబ్దాలను భరించలేక ఊరిని వదిలిపెట్టి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వీర్లపల్లి గ్రామాన్ని అక్కడి నుంచి తరలించి పునరావాసం కల్పించాలంటూ కర్మాగారం యాజమాన్యంపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇటీవల ఎరువుల కర్మాగారం నిర్వహణ తీరును సమీక్షించేందుకు రామగుండం వచ్చిన ఆర్.ఎఫ్.సి.ఎల్. చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అశోక్ సింఘాల్‌ను కలిసి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు

**డిశ్చార్జి ప్లాంటు నిర్మాణమే శరణ్యం**

రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల రసాయన వ్యర్థాలను నేరుగా ప్రధాన మురుగు కాలువలోకి



వదలడంతో గోదావరిఖని విఠల్‌నగర్ ప్రాంత ప్రజలు వాసన భరించలేక ఇళ్లల్లోంచి పరుగెత్తాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తం చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే, మేయర్ ముందు ఇలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కర్మాగారం ఉన్నతాధికారులను కోరారు. ఇదే స్థాయిలో వాయు కాలుష్యం తప్పడం లేదు. ప్రత్యేక పైపులైను ద్వారా ఎరువుల కర్మాగారం రసాయన వ్యర్థాలను గోదావరినదిలోకి వదులుతున్నారు. దీనిపై అప్పటి ప్రజాప్రతినిధులు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాలుష్య నివారణ చర్యలు తీసుకునేంత వరకు కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు కర్మాగారాన్ని పరిశీలించి మార్గదర్శకాలను జారీ చేశారు. గడువులోగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యాజమాన్యం ఆచరణను విస్మరించింది. ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత సుమారు రూ.210 కోట్ల అంచనా వ్యయంతో కర్మాగారంలో జీరో లిక్విడ్ డిశ్చార్జి ప్లాంటు నిర్మాణం చేపట్టేందుకు కర్మాగారం చర్యలు తీసుకోగా ఇటీవలే టెండర్లు పిలిచారు.

**పునరావాసమే పరిష్కారం..**

గతంలో ఎఫ్.సి.ఐ. ఎరువుల కర్మాగారం గోదావరిఖని వైపునకు ఉండడంతో వీర్లపల్లి వాసులు అంతగా ఇబ్బంది పడేవారు కారు. తాజాగా ఆర్.ఎఫ్.సి,ఎల్. ఎరువుల కర్మాగారం పూర్తిగా వీర్లపల్లి పక్కనే ప్రహరీని ఆనుకొని నిర్మించడంతో వీర్లపల్లి వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కర్మాగారం నుంచి వెలువడే శబ్ధాలతో పక్కపక్కనే ఉన్నా ఒకరికొకరు మాట్లాడుకుంటే వినిపించని పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మోనియా లీకేజీ జరిగిందంటే ముక్కు పుటాలు అదిరిపోవాల్సిందే.

# ఆశ.. నిరాశ!

ముస్తాబాద్ : కళ్ల ముందే రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఏళ్లు గడుస్తుంది. అయినా వారి సొంతింటి కల మాత్రం నెరవేరిన దాఖలాలు లేవు. గుత్తేదారు చివరి దశలో చిన్న చిన్న పనులు చేపట్టకుండా వదిలేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. నిర్మించినవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముస్తాబాద్ మండలంలోని ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లి గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. కొండాపూర్, గూడెం గ్రామాల్లో ఇళ్లు నిర్మించారు. ఈ రెండు గ్రామాల్లో ముందుగానే గ్రామ పంచాయతీ పాలకవర్గం సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు.కొండాపూర్‌లో 40 ఇళ్లు నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గూడెంలో 48 ఇళ్లు కట్టారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకు వంటి చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. సదరు గుత్తేదారు పనులు చేయకపోవడంతో పంపిణీ చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.నాటి నుంచి నేటి వరకు



లబ్ధిదారులు రెండు పడక గదుల ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో తరవాత వీటిని పట్టించుకున్న నాథుడు లేడు. నిరుపయోగంగా మారాయి.ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల వాసులు పేర్కొంటున్నారు. మరోవైపు లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. సొంతింటి కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి పంపిణీ చేయాలని లబ్ధిదారులు వేడుకొంటున్నారు.

పనులు పూర్తి చేయాలి గూడెంలో రెండు పడక గదుల ఇళ్లు 48 నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. గుత్తేదారు పనులను మధ్యలో వదిలేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సదరు గుత్తేదారు ద్వారా పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించాలి. ఈ ఇళ్లు లబ్ధిదారులకు అందిస్తే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సులభమవుతుంది. ఇరువురికి న్యాయం చేసినవారవుతారు.- చిట్నేని శ్రీనివాసరావు, స్థానికుడు

అసంపూర్తి పనులపై తెలుసుకుంటానేను ఇటీవలే ఏఈగా బాధ్యతలు చేపట్టాను. రెండు పడక గదుల ఇళ్ల పనులు ఎందుకు పూర్తి చేయలేదనే విషయాన్ని సదరు గుత్తేదారును అడిగి తెలుసుకొంటాను.

– నిఖిల్ సాయి, ఆర్అండ్‌బీ ఏఈ




మైదుకూరు: తెలుగు జాతి చరిత్ర ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగించారు. "ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం. ప్రభుత్వం అంటే పాలకులు కాదు.. సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు. పేదవాళ్లకు పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీఆర్" అని చంద్రబాబు కొనియాడారు. "ఈ నెలాఖరులో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొస్తాం. ఏ పని కావాలన్నా ఒక మెసేజ్ పెడితే చాలు. మీ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు వెళ్లే పని లేదు. మీ ముందుకే వచ్చి సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

## నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ : చంద్రబాబు

అమరావతి: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది.. నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్. బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది.. స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త.. స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని స్మృతికి నివాళులర్పిద్దాం" అని చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో.. 'అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం' అని నిరూపించిన మానసీయులు ఎన్టీఆర్ ఆశించిన సమసమాజాన్ని సాధించుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని.. తెలుగు జాతిని నంబర్ వన్ చేసేందుకు కంకణబద్ధులై ఉన్నామని తెలిపారు. "ఎన్టీఆర్ ఒక పేరు కాదు.. ప్రభంజనం.. అదొక సంచలనం. తెలుగువాడి విశ్వరూపం.. వెండితెరపై రారాజుగా వెలుగొందారు. రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లని నినదించారు. కోట్లాది హృదయాల్లో కొలువైన మా తాతగారే నాకు నిత్యస్ఫూర్తి" – మంత్రి నారా లోకేశ్ "చరిత్రలో మరణం లేని నాయకులు కొందరే ఉంటారు. అలాంటి వారు నందమూరి తారక రామారావు. తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా జీవిస్తున్న వ్యక్తి అన్నగారు. గతేడాది ఇదే రోజు మాట్లాడాను. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ అతిపెద్ద విజయం సాధించబోతుందని చెప్పాను. ఆ విజయం తర్వాత ఎన్టీఆర్‌కు భారత రత్న రావాలని కోరుకున్నాను. భారతరత్నకే అన్నగారు వన్నె తెస్తారు. రానున్న రోజుల్లో అది నిజం కావాలి" – ఏపీ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు

**జన్మజన్మలకు ఆయన కుమార్తెగానే పుట్టాలని కోరుకుంటున్నా: పురందేశ్వరి..** విజయవాడలో ఎన్టీఆర్ విగ్రహానికి భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నివాళి అర్పించారు. ఎన్టీఆర్‌ది మరణం లేని జననం అని కొనియాడారు. ఏ రంగంలోకి వెళ్లినా ఆ రంగానికే వన్నె తెచ్చారని చెప్పారు. సినిమా చరిత్రకు కొత్త గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. రాజకీయాల్లోనూ తనకంటూ కొత్త చరిత్ర రాశారని వివరించారు. ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని.. జన్మజన్మలకు ఆయన కుమార్తెగానే పుట్టాలని కోరుకుంటున్నట్లు పురందేశ్వరి తెలిపారు.




హైదరాబాద్: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నటుడు ఎన్టీఆర్ అని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆమె నివాళి అర్పించి మాట్లాడారు. రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేని వన్నారు. ఆయన సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు.

దీని ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఎన్టీఆర్ సిద్ధాంతాలను ట్రస్టు పాటిస్తోంది. ఆయన వర్ధంతికి ఏటా లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు.. మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుంది. నాటి నుంచి నేటి వరకు ట్రస్టుకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు రక్తాన్ని అందించాం. చర్లపల్లి ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో ఉచిత విద్య, వసతి, భోజనం కల్పిస్తున్నాం.

మెరిట్ స్టూడెంట్లకు స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాం. ట్రస్టు ద్వారా ప్రజాసేవకు అందరికంటే ముందుంటాం. తుపాన్లు, కొవిడ్ సమయాల్లో అనేక సేవలు అందించాం" అని నారా భువనేశ్వరి తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన పవన్






గుంటూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులో ఆయన పర్యటించారు. 'స్వచ్ఛత దివస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుద్ధ్య తరలింపు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మొక్కలు నాటారు. "ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. పరిశుభ్రత ప్రాధాన్యత కరోనా సమయంలో అందరికీ తెలిసి వచ్చింది. పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనేది ఏ ఒక్కరి వల్లో అయ్యేది కాదు.. అందరూ బాధ్యత తీసుకోవాలి. పరిశుభ్రత మన జీవితంలో భాగం కావాలని చంద్రబాబు ఆకాంక్ష. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అనేది తేలికైన విషయం కాదు. వెంటనే అద్భుతాలు ఆశించలేం కానీ.. ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని పవన్ అన్నారు.

## ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేశ అసంతృప్తి.. సొంత నిధులతో మరమ్మతులకు ఆదేశం

హైదరాబాద్: నగరంలోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఏపీ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ వెళ్లారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని గమనించారు. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు సొంత నిధులతో పూర్తి చేయాలని లోకేశ్ నిర్ణయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అప్పగించాలని పలుమార్లు గత తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని లోకేశ్ తెలిపారు.






## చీకట్లు తొలగక ముందే.. తారక్..కల్యాణ్ రామ్ నివాళి

అమరావతి : ప్రాంతాలు వేరైనా తెలుగోళ్లందరికి అరాధ్యదైవంగా నిలిచే నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఈ ఉదయం (శనివారం) తెల్లవారుజామున ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చారు జూనియర్ ఎన్టీఆర్ అలియాస్ తారక్.. ఆయన సోదరుడు కల్యాణ్ రామ్. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెల్లవారుజామునే తారక్ వస్తూ ఉంటారు. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ సంప్రదాయాన్ని తారక్ ఈసారీ పాటించారు.

సోదరుడు కల్యాణ్ రామ్ తో కలిసి వచ్చిన తారక్.. తాత ఎన్టీఆర్ కు ఘనంగా నివాళులు అర్పించారు. కాసేపు అక్కడే మౌనంగా కూర్చుండిపోయారు. ఆ తర్వాత వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉన్నారు. ఆరేళ్ల క్రితం ఎన్టీఆర్ 97వ జయంతిని పురస్కరించుకొని పలువురు రాజకీయ నేతలు.. అభిమానులు ఎన్టీఆర్ ఘాట్ ను సందర్శించారు. అందులో తారక్.. కల్యాణ్ రామ్ లు ఉన్నారు. వారిద్దరు వచ్చేసరికి ఎన్టీఆర్ ఘాట్ పూలతో కళకళలాడాల్సిన దానికి భిన్నంగా ఎలాంటి అలంకరణ లేకుండా బోసిపోవటంతో.. తారక్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పూలు తెప్పించి.. డెకరేట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన తారక్.. ఇకపై తాత వర్ధంతి.. జయంతి వేడుకల ఏర్పాట్లు తానే స్వయంగా చూసుకుంటానని చెప్పటమే కాదు.. అప్పటినుంచి ఆయనే చూసుకుంటున్నట్లు చెబుతారు. గత ఏడాది తారక్ దగ్గర ఉండి తాత సమాధిని పూలతో అలంకరించారు.

ఈ సందర్భంగా అక్కడ భారీ ఎత్తున తారక్ ఫ్లెక్సీలు ఉండటంపై బాలక్రిష్ణ ఆగ్రహం వ్యక్తం చేయటంతోపాటు.. వాటిని తొలగించాలని చెప్పటంతో కాస్తంత టెన్షన్ వాతావరణం నెలకొంది. నిజానికి వర్ధంతి.. జయంతి వేళలో.. ఎన్టీఆర్ ఘాటను వ్యక్తిగత ప్రచారాల కోసం వాడటం బాగోదు. ఒకవేళ.. అత్యుత్సాహంతో అభిమానులు అలాంటి పని చేసినా.. తారక్ అభ్యంతరం వ్యక్తం చేసి ఉంటే బాగుండేది. మిగిలిన సంగతులు ఎలా ఉన్నా..ఎప్పటిలానే ఎన్టీఆర్ జయంతి.. వర్ధంతి రోజున తానే మొదట వచ్చి నివాళులు అర్పించే సంప్రదాయాన్ని తారక్ మరోసారి పాటించారని చెప్పాలి.




హైదరాబాద్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించి తెదేపాను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తెదేపాలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమన్నారు.

తెలుగు జాతి ఎక్కడ ఉన్నా అగ్ర స్థానంలోకి ఎదగాలని లోకేశ్ ఆకాంక్షించారు. "ఎన్టీఆర్ రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు.. ప్రభంజనం. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలు తీసుకొచ్చారు. ఆయకు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం. తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. విశాఖ ఉక్కును కాపాడుకుంటున్నాం.


తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. తెదేపాపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉంది" అని నారా లోకేశ్ తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

పోలవరం: పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన పనులను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది.

1.396 కిలోమీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిం చారు. 1.5 మీటర్ల మందంతో నది ప్రవాహ మార్గంలో భూమి లోపల దీని నిర్మాణం చేపట్టనున్నారు.

పాత డయాఫ్రమ్ వాల్‌కు 6 మీటర్ల ఎగువన కొత్త నిర్మాణం చేపట్టనున్నారు. సగం నిర్మాణం పూర్తి కాగానే సమాంతరంగా దాని పైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ షెడ్యూలు జారీ చేసింది. కొత్త డయాఫ్రం వాల్ కోసం రూ.990 కోట్లు ప్రభుత్వం వ్యయం చేయనుంది.



## నా జీవితం టీడీపీకే అంకితం..

అమరావతి : టీడీపీ కేంద్ర కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. బ్లడ్ డొనేషన్ క్యాంపును మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగారన్నారు. ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజుల ఎదిగారని తెలిపారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి తీసుకు రాగలిగారని.. బీసీలకు రాజకీయ అవకాశం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. దేశంలో సంక్షేమం అనే పదం పుట్టింది ఎన్టీఆర్ నోటి నుంచే అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పటేల్ పట్వారి వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించింది ఎన్టీఆర్ అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఒక ప్రాంతీయ పార్టీకి అధ్యక్షుడైన ఎన్టీఆర్ ఆనాడు దేశంలో ఉన్న పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చారని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను పునికి పుచ్చుకొని చంద్రబాబు పార్టీని నడిపిస్తున్నారన్నారు. "నాకు ప్రాణం తెలుగుదేశం పార్టీ.

నా జీవితం తెలుగుదేశం పార్టీకి చంద్రబాబుకి అంకితం" అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



## ఎన్టీఆర్ పేరెత్తని పార్టీ లేదు: హోంమంత్రి అనిత

సినిమా రంగంలో రాముడైనా.. రావణాసురుడైనా ఎన్టీఆర్ అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మహిళలు అన్నగా పిలిచిన... ఆరాధ్య దైవంగా పిలిచిన అన్న ఎన్టీఆర్ అని తెలిపారు. సినిమా రంగంలో నటన ఎన్టీఆర్‌కు తెలుసుగాని... రాజకీయరంగంలో నటన అనేదే ఎన్టీఆర్‌కు తెలియదన్నారు. కోటి దాటినా పార్టీ సభ్యత్వ నమోదుతో తాత ఎన్టీఆర్‌కు లోకేష్ నిజమైన నివాళులర్పించారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ పేరు ఎత్తకుండా ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించలేదన్నారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీకి ఒడిదుడుకులు ఎదురవుతున్న చంద్రబాబు నడిపిస్తూనే వస్తున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు, లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని హోంమంత్రి అనిత వెల్లడించారు.






## బ్లాక్‌లో మెరిసిన ఎన్టీఆర్-నీల్ హీరోయిన్

'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాలో నిఖిల్‌కు జోడీగా నటించిన ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఈ అమ్మడికి పెద్ద సినిమాలు ఏమీ పడలేదు. కానీ కన్నడంలో మాత్రం ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా ఈ అమ్మడు చేసిన సప్త సాగరాలు దాటి సినిమా రెండు పార్ట్‌లకు మంచి స్పందన దక్కింది. ఆ సినిమా రెండు భాగాలను తెలుగు ప్రేక్షకులు చూసి ఆదరించారు. అందుకే తెలుగులో ఈ అమ్మడు డైరెక్ట్ సినిమా మళ్లీ ఎప్పుడు చేస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు తెలుగులో ఈ అమ్మడు ఎన్టీఆర్‌కి జోడీగా నటించబోతుంది. సప్త సాగరాలు దాటి సినిమాలో నటనతో మెప్పించిన ఈ అమ్మడు అందంతోనూ ఆకట్టుకుంటూ ఉంది. సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లోనే కాకుండా స్కిన్ షోతోనూ ఈ అమ్మడు ఆకట్టుకుంది. పలు సార్లు సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన ఈ అమ్మడు ఈసారి సింపుల్ అండ్ స్వీట్ అనిపించే విధంగా బ్లాక్ ఔట్ ఫిట్‌లో సందడి చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు బ్లాక్ ఔట్ ఫిట్‌లో ఈమె అందానికి ఫిదా అవుతున్నారు. బ్లాక్ డ్రెస్ ఈమెకి బాగా సెట్ అయ్యింది. గతంలో షేర్ చేసిన ఫోటోలతో పోల్చితే ఈ ఫోటోలు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయంటున్నారు. ఎన్టీఆర్‌తో ఈమె నటించబోతుంది అంటూ నందమూరి ఫ్యాన్స్ ఈ పోటోలను తెగ షేర్ చేస్తున్నారు. దర్శకుడు



ప్రశాంత్ నీల్ ఇటీవలే ఎన్టీఆర్‌తో సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రారంభించాడని, ఈ నెల చివరి వారంలో ఎన్టీఆర్ సైతం షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. అంతే కాకుండా ఎన్టీఆర్ కి జోడీగా రుక్మిణి వసంత్ నటిస్తున్నట్లుగా వస్తున్న వార్తల విషయంలో ఇప్పటి వరకు అటు నుంచి కానీ, ఇటు నుంచి కానీ ఎలాంటి స్పందన రాలేదు. త్వరలోనే ఆ విషయమై అధికారికంగా ప్రకటన వస్తుందేమో చూడాలి. రుక్మిణి ఆర్మీ స్కూల్‌లో చదువుకుంది. ఎయిర్ ఫోర్స్‌లో ట్రైనింగ్ చేసింది. లండన్‌లోని బ్లూమ్స్‌బరీలోని రాయల్ అకాడమీలో నటనలో పట్టా పొందింది. యాక్టింగ్ విషయంలో విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న రుక్మిణి వసంత్ కచ్చితంగా ఎన్టీఆర్‌కి జోడీగా నటించడం ద్వారా సినిమాకు ఆర్షణగా నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్టీఆర్‌తో కలిసి ఈ అమ్మడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్‌తో సినిమా తర్వాత పాన్ ఇండియా స్థాయిలో ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## పీసీ పిచ్చెక్కించేందుకు రెడీ..!

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ షిఫ్ట్ అయిన అందాల భామ ప్రియాంక చోప్రా ఇంగ్లీష్ సినిమాలు, సీరీస్ లు చేసుకుంటూ ఫుల్ బిజీ అయ్యింది. ఇండియన్ సినిమా ఆఫర్లు వస్తున్నా కూడా ఒక్క దానికి కూడా అమ్మడు ఇంట్రెస్ట్ చూపించట్లేదని తెలుస్తుంది. 2015 లో బాజీరావ్ మస్తాని, 2016లో జై గంగాజల్ సినిమాల్లో నటించిన ప్రియాంక చోప్రా ఆ నెక్స్ట్ ఇయర్ బేవాచ్ ఛాన్స్ అందుకుని హాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. ఇక అప్పటి నుంచి అమ్మడికి తిరుగు లేని విధంగా క్రేజ్ తెచ్చుకుంది. నిక్ జోనస్ తో పెళ్లి తర్వాత ప్రియాంక పూర్తిగా హాలీవుడ్ కే పరిమితమైంది. ప్రియాంక చోప్రా ని హిందీ మేకర్స్ కన్సల్ట్ అయినా కూడా ఆమె చేయలేనని చెప్పడం కామన్ అయ్యింది. హాలీవుడ్ వెళ్లాక బాలీవుడ్ ని చిన్న చూపు చూస్తుందని కొందరు




హడావిడి చేసినా కూడా వాటిని అసలు ఏమాత్రం పట్టించుకోకుండా లైట్ తీసుకుంది అమ్మడు. ఆఫ్టర్ లాంగ్ టైం ప్రియాంక చోప్రా ఒక ఇండియన్ సినిమాలో నటిస్తుందని వార్తలు వస్తున్నాయి. అది కూడా సూపర్ స్టార్ మహేష్, రాజమౌళి కాంబోలో వస్తున్న సినిమాలో అమ్మడు నటిస్తుందని టాక్. ఈ సినిమాను ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కిస్తారని తెలుస్తుంది. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తే గ్లోబల్ వైజ్ గా ఈ ప్రాజెక్ట్ కి క్రేజ్ వస్తుంది. ఐతే ఈమధ్య హిందీ సినిమాలకే తాను ఓకే చెప్పని ప్రియాంక మహేష్ సినిమాకు ఓకే చెబుతుందా లేదా అన్నది తెలియాల్సి ఉంది. మహేష్ 29వ సినిమానే కాదు ప్రియాంక చోప్రా జోనస్ బ్రదర్స్ చేస్తున్న సినిమాలో కూడా నిక్ జోనస్ తో కలిసి ప్రియాంక ఆన్ స్క్రీన్ రొమాన్స్ చేయనుంది. మరి భర్తతో కలిసి మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఆ ప్రాజెక్ట్ ఎలా ఉంటుందో చూడాలి. ప్రియాంక చోప్రా సినిమా కోసం ఇండియన్ సినీ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. మరి SSMB 29 సినిమాలో ప్రియాంక నటిస్తుందా లేదా. అసలు ఈ సినిమా ఆఫర్ అమ్మడిదాకా వెళ్లిందా లేదా అన్నది కూడా క్లారిటీ రావాల్సి ఉంది. పీసీ మాత్రం హాలీవుడ్ లో ఫాం ని ఇండియన్ స్క్రీన్ మీద కొనసాగించాలని చూస్తుంది. అది నెరవేరుతుందా లేదా అన్నది చూడాలి.

## రాజా బాక్సాఫీస్ వద్ద రప్పాడించేస్తున్నాడే!



విశాల్ హీరోగా నటించిన మదగజరాజా ఇటీవల విడుదలై మంచి టాక్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల క్రితం తీసిన సినిమా ఇప్పుడు రిలీజ్ అయి పాజిటివ్ టాక్ తో ఆడటం అంటే చిన్న విషయం కాదు. ఆ రకంగా మదగజరాజా మంచి సక్సస్ సాధించిందని చెప్పాలి. ఈ సినిమా రిలీజ్ కి ముందు విశాల్ ప్రచారానికి హాజరైతే ఆయన ఆరోగ్యంపై ఎన్నో కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడు కోలుకోవడం ...సినిమా సక్సెస్ అవ్వడం వరుసగా కలిసొచ్చింది. ఈ చిత్రం ఇప్పటికే తమిళ నాడులో 25 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. కేవలం ఐదు రోజుల్లోనే 25 కోట్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద ఈ దూకుడు చూస్తుంటే 50 కోట్లు పెద్ద విషయం కాదు. లాంగ్ రన్ లో సినిమా 50 కోట్ల వసూళ్లతో ముగిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ సంక్రాంతికి తమిళనాడులో సినిమాలేవి రిలీజ్ కాలేదు. విశాల్ సినిమాతో పాటు కొన్ని సినిమాలున్నా అందులో మదగజరాజాకి పాజటివ్ టాక్ రావడంతో పాటు 12 ఏళ్ల క్రితం నాటి విశాల్ ను తెరపై చూడటం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించింది. విశాల్ అనారోగ్యం కూడా సినిమాపై కొంత సింపతీ కారణమైందన వాదన కూడా వినిపిస్తుంది. ఇలా సినిమాకి అన్ని రకాలుగా కలిసొచ్చింది. ఈ చిత్రాన్ని సుందర్ సి తెరకె క్కించగా జెమినీ ఫిల్మ్ -బెంజ్ మీడియా సంస్థలు నిర్మించాయి. విశాల్ ఫిలిం ఫ్యాక్టరీ నుంచి పంపిణీ అయింది. ఇందులో సంతానం, అంజలి , వరలక్ష్మి శరత్ కుమార్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో వీళ్లకి కూడా మంచి బూస్టింగ్ లభించింది. కోలీవుడ్ లో ఈ మధ్య కాలంలో వీళ్లు నటించిన సినిమాలు కూడా పెద్దగా ఆడలేదు. %-%గేమ్ ఛేంజర్%-% సినిమాలో అంజలి భాగమైంది. కానీ ఆ సినిమా ఫ్లాప్ టాక్ అమ్మడిని తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆ సినిమా హిట్ అయితే రేంజ్ మరోలా ఉండేది.

## కల్కి 2: అసలు కథ ఇదన్నమాట!



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి 2898 AD తెలుగు సినిమా చరిత్రలో ఒక బిగ్ రికార్డ్ అందుకున్న విషయం తెలిసిందే. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలకు ముందే భారీ అంచనాలు ఏర్పడి, విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లను సాధించింది. 1000 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టి తెలుగు సినిమా గర్వకారణంగా నిలిచింది. ఇప్పటికే కల్కి 2 సీక్వెల్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావడంతో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక నిర్మాత అశ్విని దత్ ఇటీవల కల్కి 2 గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సీక్వెల్ కథ మూడు ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ పాత్రలు ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లకు సంబంధించినవి కావడం విశేషం. మొదటి భాగంలో అమితాబ్ అశ్వత్థామ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉండగా, కమల్ హాసన్ కలి పాత్ర పరిమిత స్క్రీన్ టైమ్‌తో మాత్రమే ఉండింది. ఇది అభిమానులకు కొంత నిరాశ కలిగించింది. కానీ, కల్కి 2లో కమల్ హాసన్ పూర్తి స్క్రీన్ టైమ్‌లో కనిపించి, ప్రభాస్‌తో సన్నివేశాలు ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని కలిగిస్తాయని అశ్విని దత్ పేర్కొన్నారు. కమల్ హాసన్ ఇప్పటికే ప్రమోషన్ల సమయంలో తన పాత్ర గురించి వివరించి, ఇది రెండవ భాగంలో మరింత డెవలప్ అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో, ప్రభాస్, కమల్ మధ్య సన్నివేశాలు కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటాయని అంచనా. అమితాబ్ పాత్రకు ఈ సారి కూడా ప్రాధాన్యం ఉండడం విశేషం. దీపికా పదుకొణె పాత్ర కూడా రెండవ భాగంలో ప్రాముఖ్యాన్ని సాధిస్తుందని అశ్విని దత్ క్లారిటీ ఇచ్చారు. నూతన పాత్రలు ఈ సారి రావడం అనుమానమేనని నిర్మాత తెలిపారు. ఇది మొత్తం నారేటివ్‌ను ముగించేందుకు కేవలం ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగుతుందని చెప్పారు. సెకండ్ పార్ట్ 2026లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు అశ్విని దత్ స్పష్టం చేశారు. కల్కి 2 కథ, నిర్మాణ విలువలు, సాంకేతికతతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమాకు గర్వకారణంగా నిలిచే అవకాశం ఉంది. ఇక ఈసారి బాక్సాఫీస్ వద్ద పార్ట్ 2తో 2000 కోట్లు రావడం గ్యారెంటీ అనేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

## పూజా.. రెడ్ హాట్ ఆల్ఫా ఫీమేల్!

దక్షిణాది నుంచి పూర్తిగా నిష్క్రమించింది పూజా హెగ్డే. ఇక్కడ అవకాశాలు లేని సమయంలో హిందీ పరిశ్రమలో బిజీగా మారింది. తాజాగా రోషన్ ఆండ్రూస్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం దేవా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో షాహిద్ కపూర్ సరసన పూజా కథానాయికగా నటించింది. ఇంతకుముందు టీజర్ విడుదల చేయగా, అది గ్రిప్పింగ్ డ్రామాతో ఆకట్టుకుంది. ఇప్పుడు మేకర్స్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. టీజర్, ట్రైలర్ సినిమాపై



క్యూరియాసిటీని పెంచాయి. ట్రైలర్ లో షాహిద్ కపూర్ పోలీసు పాత్ర ఆకట్టుకుంది అతడి నటన కెరీర్ బెస్ట్ గా ఉంటుందని భరోసా లభించింది. ఇక ఈ చిత్రంలో కథానాయికగా నటించిన పూజా హెగ్డే .. షాహిద్‌తో అద్భుతమైన కెమిస్ట్రీని వర్కవుట్ చేయడం హెడ్ లైన్స్ లో నిలుస్తోంది. ఈ గ్రిప్పింగ్ కాప్ డ్రామాలో షాహిద్‌ను ఇంతకు ముందు ఎప్పుడూ చూడని అవతార్‌లో దర్శకుడు ఆవిష్కరించనున్నారు. ఈ కాప్ డ్రామాతో పూజా హెగ్డే చాలా కాలం తర్వాత హిందీ పరిశ్రమకు తిరిగి వస్తోంది. దేవా విజయంపై సర్వత్రా ఉత్కంఠగా వేచి చూస్తోంది. దేవా మేకర్స్ ఇప్పటికే విడుదల తేదీని ఖరారు చేశారు. దేవా 31 జనవరి 2025న థియేటర్లలోకి రానుంది.

తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో పూజా ఎరుపు రంగు డేవిడ్ కోమా మినీ డ్రెస్‌లో కనిపించింది. సన్నని హాల్టర్-నెక్ పట్టీలు, ఆఫ్ షోల్డర్ , లాంగ్ స్లీవ్‌లు , కఫ్ జిప్‌లు అందాన్ని పెంచాయి. పూజా సింపుల్ గా అనవసర హంగామా లేకుండా కొన్ని ఆభరణాలను ధరించింది. తాజా ఈవెంట్లో పూజా హెగ్డే మాట్లాడుతూ-మీరు ఆల్ఫా మగవాడిని చూశారు.. ఇప్పుడు ఆల్ఫా ఫిమేల్ రాక కోసం సమయం ఆసన్నమైంది అని వ్యాఖ్యానించారు.

## ఒక్క హుక్స్ పెట్టుకుని.. రాశీఖన్నా సంక్రాంతి ట్రీట్

సాంప్రదాయం ఓవైపు.. గ్లామర్ ఎలివేషన్ మరోవైపు.. ఈసారి సంక్రాంతి బ్లౌజ్ ల ఎంపిక మునపటితో పోలిస్తే చాలా స్పైసీగా కనిపించాయి. బుల్లితెర నటీమణులు, వెండితెర కథానాయికలు సంక్రాంతి సందర్భంగా తమ ఫ్యాషన్ సెన్స్ విషయంలో చాలా అప్ గ్రేడ్ అయ్యారు. మునుపటి రోజులతో పోలిస్తే ఇటీవల కొంత ఎక్స్ పోజింగ్ కూడా ఎక్కువైందనేది కాదనలేని నిజం. ఈ మకర సంక్రాంతిని పురష్కరించుకుని అందాల కథానాయిక రాశీఖన్నా ఇచ్చిన ట్రీట్ అందుకు మినహాయింపేమీ కాదు. రాశీ చూడటానికి ట్రెడిషనల్ లుక్ లో కనిపించినా అందమైన బ్లౌజ్ ని స్పైసప్ చేసింది. ఒకే ఒక్క



హుక్స్ పెట్టుకుని, అందమైన డిజైనర్ బ్లౌజ్ తో కవ్వించింది రాశీ. ఇక ఈ బ్లౌజ్ కి తగ్గట్టే, డిజైనర్ శారీని కూడా ఎంపిక చేసుకుంది. ఓవరాల్ లుక్‌లో రాశీ ట్రీట్ అభిమానులను కట్టి పడేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ యువతరంలో వైరల్‌గా మారుతున్నాయి. ఎర్ర అంచు చీర.. డిజైనర్ బ్లౌజ్ లో రాశీ ఖన్నా టూమచ్ గా కవ్విస్తోంది! అంటూ అభిమానులు భేజారైపోతున్నారు. రాశీ నెవ్వర్ బిఫోర్ లుక్ ఇది అంటూ వెబ్ లో వైరల్ చేస్తున్నారు. రాశీఖన్నా నిజంగా ఈ డ్రెస్ లో ఎంతో అందంగా ఉందంటూ పలువురు అభిమానులు లవ్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ప్రస్తుతం వరుసగా వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటించేందుకు రాశీ సన్నాహకాల్లో ఉందని సమాచారం. సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా అనే తెలుగు చిత్రంలో నటిస్తున్న రాశీ... టిఎంఇ (విక్రాంత్ మాస్సే) అనే హిందీ చిత్రంలోను నటిస్తోంది. అగథియా ప్రస్తుతం చిత్రీకరణలో ఉంది. టిఎంఇ, అగథియా కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు అని తెలుస్తోంది.




# ఆర్జీకర్ ఘటన.. సంజయ్‌రాయ్ దోషి

కోల్‌కతా: దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో కోల్‌కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది. "నీకు శిక్ష తప్పదు. బాధితురాలిని నీవు చంపిన తీరుకు యావజ్జీవ కారాగార శిక్ష లేక మరణశిక్ష విధించవచ్చు. సోమవారం శిక్షఖరారు చేస్తాం" అని న్యాయమూర్తి అన్నారు. సీబీఐ సమర్పించిన ఆధారాల మేరకు సంజయ్‌ను కోర్టు దోషిగా తేల్చింది. తీర్పు నేపథ్యంలో భారీ భద్రత మధ్య సంజయ్‌ను కోర్టుకు తీసుకువచ్చారు. తాను ఏ తప్పూ చేయలేదని, తనను తప్పుడు కేసులో ఇరికించారని ఈ సందర్భంగా జడ్జికి సంజయ్ తెలిపాడు. అతనికి సోమవారం మాట్లాడే అవకాశం ఇస్తామని న్యాయమూర్తి వెల్లడించారు. ఈ తీర్పును తాను గౌరవిస్తున్నానని మృతురాలి తండ్రి కోర్టులో కన్నీటిపర్యంతమయ్యారు. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారిస్తోంది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరనుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జిషీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇదిలా ఉంటే.. తీర్పు నేపథ్యంలో కోర్టు వద్ద భారీగా భద్రతాసిబ్బందిని మోహరించారు.



# ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ నివాళి



హైదరాబాద్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నటుడిగా, నాయకుడిగా, సీఎంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు.

**ఎన్టీఆర్ లాంటి వారికి మరణం ఉండదు: నందమూరి బాలకృష్ణ..** నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని నందమూరి బాలకృష్ణ తెలిపారు. ఆయన విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి తెదేపా పుట్టిందని చెప్పారు. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఆయన అంటేనే నటనకు నిర్వచనం.. నవరసాలకు అలంకారమని కొనియాడారు. ఆయన ఒక వర్సిటీ.. జాతికి మార్గదర్శకమని చెప్పారు. ఎన్టీఆర్ లాంటి వారికి మరణం ఉండదని పేర్కొన్నారు. "ఎన్టీఆర్ అంటే యువతకు ఆదర్శం. నాడు 330కి పైగా తాలూకాలను.. 1000కి పైగా మండలాలుగా విభజించి పాలనను సులభతరం చేశారు. రెండు రూపాయలకు కిలో బియ్యం తీసుకొచ్చారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించారు. తెలుగువారి గుండెల్లో ఆయన చిరస్మరణీయంగా నిలిచిపోయారు. యువత, డాక్టర్లు, ఇంజినీర్లను ఎంతోమందిని ఎన్టీఆర్ రాజకీయాల్లోకి తీసుకువచ్చారు" అని బాలకృష్ణ తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెదేపాను స్థాపించారని నందమూరి రామకృష్ణ అన్నారు. 9 నెలల్లోనే తెలుగు ప్రజలు ఎన్టీఆర్‌ను సీఎం చేశారని చెప్పారు. ప్రాంతాలు వేరైనా తెలుగువారంతా ఒకటేనని ఆయన చాటారన్నారు.

# తెలంగాణలో ఎస్టీటీ డేటా సెంటర్ భారీ పెట్టుబడి



హైదరాబాద్: తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఎస్టీటీ డేటా సెంటర్ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.3,500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌లోని ఎస్టీటీ డేటా సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఓయూపై ఎస్టీటీ సీఈవో బ్రూనో సంతకాలు చేశారు. ఇప్పటికే హైటెక్ సిటీలో ఓ డేటా సెంటర్ నిర్వహిస్తోన్న ఎస్టీటీ.. ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఎస్టీటీ డేటా సెంటర్ సంస్థ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతోందని హర్షం వ్యక్తం చేశారు.



# ఫార్ములా ఈ కేసు.. ఏసీబీ ముందుకు ఆ కంపెనీ ప్రతినిధులు


హైదరాబాద్, జనవరి 18: ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్‌ఎండీఏ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిను ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. 2022 అక్టోబర్ 25న జరిగిన తొలి ఒప్పందంపై కంపెనీ ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నిస్తోంది. సీజన్ 9, తర్వాత రేస్‌ల నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకోవడంపై ఆరా తీస్తున్నారు. సీజన్ 9 మిగతా రెండు విడతల డబ్బులు ఎందుకు చెల్లించలేదో అని అడిగి తెలుసుకుంటున్నారు. సీజన్ 9 కోసం కేవలం ఒక దఫా రూ.30 కోట్లు మాత్రమే గ్రీన్‌కో చెల్లించింది. మిగతా రెండు విడతల డబ్బులు ఎఫ్ఈవోకు గ్రీన్‌కో ఎగ్గొట్టింది. సీజన్ 10 తో పాటు నాలుగు సీజన్‌లకు ఒప్పందం చేసుకున్నప్పటికీ ఎందుకు వెనక్కి వెళ్లిందో అని నెక్స్ట్ జెన్ కంపనీ ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నించనుంది. అగ్రిమెంట్ ఉల్లంఘనకు ప్రధాన కారణం ఏంటో అని గ్రీన్‌కోను క్వశ్చన్ చేయనుంది. బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన ఎలక్టొరల్ బాండ్స్ తేదీలపైనా ఏసీబీ దృష్టిసారించింది. కాగా.. ఫార్ములా ఈ కార్ రేసింగ్ సంబంధించి ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ప్రతినిధులకు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. వ్యక్తిగతంగా హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో ఈరోజు ఉదయం 10 గంటలకు ఏసీబీ ముందు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. ఇతర రాష్ట్రం నుంచి వస్తున్న క్రమంలో ఫ్లైట్ డిలే కావడంతో ఏసీబీ అధికారుల అనుమతి తీసుకుని మధ్యాహ్నానికి సదరు కంపెనీ ప్రతినిధులు విచారణకు వచ్చారు. సీజన్ 9 నిర్వహణకు సంబంధించిన ఒప్పంద పత్రాలు, సీజన్ 10 నుంచి ఎందుకు వైదొలిగారు అనే అంశాలపై కంపెనీ ప్రతినిధులను వివరాలు అడిగి.. వారు ఇచ్చే స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనుంది ఏసీబీ. రూ.55 కోట్లు ఎఫ్ఈవో కంపెనీకి బదిలీ అయిన తర్వాత.. సీజన్ 10ను నిర్వహించేందుకు ఎఫ్ఈవో కంపెనీ కూడా నిరాకరించడంతో.. ముందస్తు ఒప్పందాలను కూడా ఉల్లంఘించారని ప్రభుత్వం భావిస్తోంది. 2022 అక్టోబర్ 25న జరిగిన తొలి ఒప్పందానికి సంబంధించి డాక్యుమెంట్లతో ఎస్ నెక్స్ట్ జెన్ కంపనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఒప్పందాల వివరాలు, స్పాన్సర్‌షిప్, ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత నష్టం వాటిల్లిదనే దానిపై ఏసీబీ విచారిస్తోంది. అవసరం అనుకుంటే మరోసారి కూడా విచారణకు రావాల్సి ఉంటుంది. మధ్యాహ్నం నుంచి విచారణ ప్రారంభమైన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం 5, 6 గంటలకు విచారణ ముగియనుంది. సమయం తక్కువగా ఉన్న తరుణంలో మరోసారి విచారణకు రావాల్సిందిగా కంపెనీ ప్రతినిధులకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కేటీఆర్‌లను ఏసీబీ విచారణ జరిపి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన నేపథ్యంలో వారి స్టేట్‌మెంట్ ఆధారంగా కంపెనీ ప్రతినిధులను ఏసీబీ విచారిస్తోంది. అలాగే కేసులో అనుబంధ కంపెనీలు ఉన్నందున వాటికి కూడా నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# సింగపూర్ పర్యటన.. సెమీ కండక్టర్ అసోసియేషన్‌తో సమావేశమైన శ్రీధర్‌బాబు



సింగపూర్: సింగపూర్ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు సెమీకండక్టర్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఆ పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. సమావేశంలో ఎస్ఎస్ఐఏ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్‌ఛైర్మన్ టాన్ యూ కాంగ్ పాల్గొన్నారు. తెలంగాణాలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను శ్రీధర్‌బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఎస్ఎస్ఐఏ ప్రతినిధులను తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది చివర్లో హైదరాబాద్ వస్తామని తెలిపారు. అంతకుముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సింగపూర్ దేశ పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫు హైయిన్‌తో సమావేశమైంది. తెలంగాణలో ఉన్న అపార పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్యాలపై ఈ సమావేశంలో ఇరుపక్షాల మధ్య విస్తృత చర్చలు జరిగాయి. పట్టణాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, నీటి వనరులు – నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్ల తయారీ సహా వివిధ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.

# తెలంగాణలో హామీలు అమలు చేశామని దిల్లీలో అబద్ధాల ప్రచారం: హరీశ్‌రావు



హైదరాబాద్: ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని దిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వేతనాలు అందక ఉద్యోగులు రోడ్డెక్కుతున్న దుస్థితి నెలకొందని ఆక్షేపించారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులకు, మూడు నెలలుగా ఉపాధిహామీ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పులపాలవుతున్నారన్నారు. తన కుర్చీని కాపాడుకోవడం కోసం దిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాల నుంచి రూ. వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామనే ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇప్పటికైనా చిరు ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# పాత చట్టానికే కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా' అని పేరు పెట్టింది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఏడు నెలలుగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని వీధిలైట్ల నిర్వహణకు నిధుల కొరత ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేస్తే.. అదే విధానాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోందని విమర్శించారు. చెరువుల కబ్జాను అరికట్టే చట్టం గతంలో కూడా ఉందని.. పాత చట్టానికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అని పేరు పెట్టిందన్నారు. మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుందని.. అది తమ బాధ్యత అని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క భాజపాకు మాత్రమే ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# రంగారెడ్డి కలెక్టర్‌ను కలిసిన మంచు మనోజ్



హైదరాబాద్: కుటుంబ వివాదాలతో నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబం గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా రంగారెడ్డి కలెక్టర్‌ను నటుడు మంచు మనోజ్ కలిశారు. ఇటీవల చోటు చేసుకున్న పలు విషయాల గురించి కలెక్టర్‌తో చర్చించారు.

తన ఆస్తుల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని కోరుతూ మోహన్‌బాబు కొన్ని రోజుల క్రితం జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. జల్‌పల్లిలోని తన నివాసాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను కొంతకాలంగా తిరుపతిలోనే ఉంటున్నానని తెలిపారు. అనంతరం ఆ నివాసంలో ఉంటున్న మనోజ్‌కు కలెక్టర్ నోటీసులు పంపించారు. ఈ క్రమంలోనే వివరణ ఇచ్చేందుకు మనోజ్ తాజాగా కలెక్టర్‌ను కలిసినట్లు తెలుస్తోంది.

# అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు: కేజ్రీవాల్




దిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్‌ఆద్మీ దిల్లీ ప్రజలకు వరుస సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేకమంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తాము ఉచిత పాఠశాలలు, ఆసుపత్రుల నుంచి ప్రయోజనం పొందుతున్నామని.. కానీ ఉచిత విద్యుత్, నీరు వంటి పథకాలకు దూరంగా ఉంటున్నామని అద్దె ఇళ్లల్లో నివసించేవారు పేర్కొంటున్నారని కేజ్రీవాల్ అన్నారు. అందుకే వారి సమస్యను పరిష్కరించి.. వారికి ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకోవడానికి తమ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఆప్ ఇప్పటికే వృద్ధుల కోసం సంజీవని స్కీమ్, మహిళా సమ్మాన్ యోజన కింద ప్రతి మహిళకు నెలనెలా రూ.2,100 ఆర్థికసాయం, అర్చకులకు రూ.18వేలు గౌరవ వేతనం మొదలైన హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దేశ రాజధానిలోని ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఉచితాల వైపు దృష్టి సారించాయి. తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్లు, ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.8,500, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పిస్తామని కాంగ్రెస్ ఉచితాలకు దూరంగా ఉండే భాజపా సైతం 'సంకల్ప పత్రా' పార్ట్–1 పేరుతో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టోలో.. గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు, 'మహిళా సమృద్ధి యోజన' కింద దిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థికసాయం వంటి హామీలను ప్రకటించింది.

**'అన్‌బ్రేకబుల్' డాక్యుమెంటరీ ప్రసారాన్ని నిలిపివేసిన పోలీసులు..** నేడు దిల్లీలో విలేకరులతో జరిగిన సమావేశంలో 'అన్‌బ్రేకబుల్' అనే డాక్యుమెంటరీని ఆప్ ప్రదర్శించడంపై వివాదం చెలరేగింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించడానికి ఆప్ నేతలు తమ అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పోలీసులు ప్రసారాన్ని నిలిపివేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఎన్నికలను ఉద్దేశించి ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేయలేదని.. స్క్రీనింగ్ ప్రదేశంలో ఎన్నికల జెండా, ప్రచారం వంటివేమీ నిర్వహించలేదన్నారు. భాజపా చేస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవ్యతిరేక చర్యలను బహిర్గతం చేస్తున్నామనే భయంతో ఆ పార్టీ ఈవిధమైన చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com